ఈనాడు
వైఎస్సార్ కడప



కలసపాడులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వెలిగొండ.. సంబరం అంబరాన్నంటగ

మార్కాపురంలో పండగలా ప్రాజెక్టు ప్రారంభోత్సవం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: 'వెలిగొండ అంటే.. కరవుపై గెలవాలనే సంకల్పం. మూడు దశాబ్దాల పోరాటం. ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు పర్వం. రైతు భవిష్యత్తుపై నమ్మకం' ఇవీ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు. దశాబ్దాల కలగా ఉన్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. కృష్ణా జలాలు తమ ప్రాంతంలో పరవళ్లు తొక్కుతున్నాయి చూసి పరవశించారు. నీటి గంగలంతో తన్మయత్వానికి లోనయ్యారు. సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చిన తర్వాత భావోద్వేగానికి లోనయ్యారు. కృష్ణమ్మకు సాష్టాంగ ప్రణామం చేశారు. బాలికలు అద్భుతంగా నృత్యం చేయడంతో వారితో ఫొటోలు దిగారు.

● **తరలివచ్చిన జన తరంగం:** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. గ్రామాలవారీగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు కిక్కిరిశాయి. హైవేగాన ఎక్కి కార్యక్రమ వద్దకు చేరుకున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల్లోనూ తరలివచ్చారు. గంటవానిపల్లె శివారున ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం సమీపంలోని పొలాలు, గట్ల వద్ద ఎటుచూసినా జనాలే కనిపించారు. ఫీడర్ కాలువ మొత్తం సందర్శకులతో నిండిపోయింది. వచ్చిన వారంతా సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు.

కృష్ణా జలాలకు సారె సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. చిత్రంలో మంత్రి నిమ్మల రామానాయుడు

మాట నిలబెట్టుకున్నాం

సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో వెలిగొండ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం ఎలా మారనుందనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. మాట నిలబెట్టుకున్నామన్నారు. వెలిగొండ రెండో దశ కూడా పూర్తయితే, కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనే నిర్వహించుకోవచ్చని చెప్పారు. ప్రాజెక్టు పనులు పూర్తిచేయడంలో కృషిచేసిన అధికారులు, సిబ్బంది, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు ప్రశంసా పత్రాలు అందజేశారు.

కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను చూసేందుకు భారీగా తరలి వస్తున్న ప్రజలు

నామాలగుండు.. జారి పడకుండా ఉండు

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పనులు జిల్లాలో చురుగ్గా సాగుతున్నాయి. కొన్నిచోట్ల అడ్డుగా ఉన్న కొండలను కూడా తొలగిస్తున్నారు. పులివెందుల సమీపంలోని నామాలగుండు వద్ద కొండను తవ్వి రహదారి ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో కొండ పైనుంచి బండ రాళ్లు పడకుండా ఇలా వలను బిగించారు. ఈ ఆకుపచ్చని వల ఇటుగా రాకపోకలు సాగించే వారిని ఆకట్టుకుంటోంది. - న్యూస్‌టుడే, వేముల

అమ్మయ్య.. అడిగే వారే లేరయా!

మారుతీనగర్(కడప), న్యూస్‌టుడే: ఆంజనేయస్వామి ఆలయం(అమ్మయ్యగారి మఠం) కడప నగరంలో ఎంతో పురాతనమైనది. ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయానికి నగరం నడిబొడ్డున ఐటీఐ ప్రధాన కూడలిలో 53 సెంట్ల స్థలం ఉంది. ప్రస్తుతం ఇక్కడ బహిరంగ మార్కెట్‌లో సెంటు విలువ రూ. 30 లక్షలకు పైగా ఉంది. జిల్లాలో అతి ప్రాచీనమైనదిగా, కడపలో మొట్టమొదటిదిగా ఈ ఆలయానికి పేరు. ఇంతటి కీలకమైన ఆలయ స్థలానికి ఇక్కడ పరిరక్షణ లేకపోయింది. కొందరు వ్యక్తులు ఆ జాగాలో పాగా వేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మరి కొందరు ఎలాంటి హక్కులు లేకున్నా అనుభవంలోకి తీసుకున్నారు. ఇంకొందరు దేవస్థానం దుకాణాల్లో వ్యాపారాలు చేసుకుంటూ అతి తక్కువ అద్దెలూ సక్రమంగా చెల్లించడం లేదు. ఇక్కడ చిన్నపాటి రేకుల గదికీ రూ. 10 వేలకు పైనే అద్దె ఉంటుంది. మఠానికి సంబంధించిన దుకాణాల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతం అద్దెకు ఉంటున్న కొందరు ఇచ్చినంత తీసుకుని అధికారులు మిన్నకుండిపోతున్నారు.

ఆలయ ప్రధాన ద్వారానికి వేలాడుతున్న తాళం

శిథిలావస్థలో ఆలయం

పూజలకు నోచని రామబంటు

ఇచ్చినంత అద్దెలే మఠానికి దిక్కు

గతంలో దూర ప్రయాణాలు సాగించేవారు రామబంటును దర్శించుకుని వెళ్లేవారు. పూజాదికాలు, నిత్యం భక్తులతో కళకళలాడిన ఆలయం.. ఇప్పుడు వెలవెలబోతోంది. ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. లోపల పిచ్చి మొక్కలు పెరిగాయి. శిథిలావస్థకు చేరి అధ్వానంగా కనిపిస్తోంది. దీంతో ఇక్కడ ఇప్పుడు ఎలాంటి పూజలు లేకపోయాయి. జిల్లా అధికారులు నిత్యంగా ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఎవరూ ఇటుగా కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్వామి వారి ఆస్తులపై సర్వే చేయించి నూతన ఆలయాన్ని నిర్మిస్తే దేవదాయశాఖకు ఆదాయం వస్తుందని, రామబంటుకూ పూర్వ వైభవం వస్తుందని భక్తులు కోరుతున్నారు.

ఐటీఐ కూడలిలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయానికి సంబంధించిన దుకాణ సముదాయం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఆంజనేయస్వామి ఆలయం (అమ్మయ్యగారి మఠం) పురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరింది. రహదారి వెడల్పు చేస్తే కొంత భాగం పోయే అవకాశం ఉండటంతో పునః నిర్మాణంపై వేచి చూస్తున్నాం. ఆలయం శిథిలావస్థకు చేరిన విషయాన్ని దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం ఆలయానికి సంబంధించిన దుకాణాల నుంచి ప్రతి నెల అద్దెల రూపంలో రూ. 22 వేలు వస్తోంది.

- సురేష్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయస్వామి ఆలయం (అమ్మయ్యగారి మఠం), ఈవో

రైతేరాజు 6లో

విద్యుత్తు మీటరు గిర్రు గిర్రు

వేంపల్లె, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో మునుపెన్నడూ లేనంతగా ప్రస్తుతం ఆగస్టులోనూ ఎండలు మండాయి. ఉక్కపోత వాతావరణం నెలకొంది. ఫలితంగా విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. గత ఏడాది ఆగస్టు 30న 13.124 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం ఉంటే.. ఈ సంవత్సరం అదే రోజున 16.548 యూనిట్లుగా నమోదైంది. వాతావరణ మార్పుతో 3.424 మిలియన్ యూనిట్ల విద్యుత్తును అధికంగా వినియోగించినట్లైంది. ఈ విషయమై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గత ఏడాదితో పోలిస్తే వినియోగం బాగా పెరిగిందన్నారు. సరఫరాలో లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు చెప్పారు. వానలు లేకపోవడంతో పరిస్థితి క్లిష్టంగా మారిందని, గృహ వినియోగానికి నిరంతరం, వ్యవసాయానికి 9 గంటలు సరఫరా చేస్తున్నామని తెలిపారు.

ఆ రెండు గంటలు.. కార్యాలయాల్లో లేకుంటే చర్యలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది పనిదినాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా తాము విధులు నిర్వహించే కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు, సంబంధిత సిబ్బందిని నేరుగా కలిసేందుకు వీలుగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలో అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ. 121 కోట్లు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సామాజిక భద్రతా పింఛన్లు అందజేస్తోంది. ఈ మేరకు సెప్టెంబర్ నెలకు గాను జిల్లాలో 2,77,037 మందికి మంజూరు చేసింది. వీరికి అందించేందుకు రూ. 121 కోట్లు కేటాయించింది. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది ఖాతాల్లోకి నిధులను జమ చేయడంతో సోమవారం బ్యాంకుల నుంచి నగదు తీసుకున్నారు. పల్లె, పట్టణాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారుల ఇంటికి మంగళవారం సిబ్బంది వెళ్లి అందజేయనున్నారు.

విభజన పర్వం.. గందరగోళం

మూడు వేర్వేరు వార్డుల్లో ఒకే ఇంట్లోని ఓటర్లు

క్షేత్రంలో ఉన్నతాధికారుల ఆదేశాలు అభాసుపాలు

ఈనాడు, కడప: స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాలని. అందుకు అనుగుణంగా ఓటర్లను సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల క్షేత్రస్థాయి సిబ్బంది వ్యవహరించిన తీరుతో ఓటర్ల జాబితా ఇప్పుడు తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. ఎటువంటి హేతుబద్ధత లేకుండా, భౌగోళిక సరిహద్దులను విస్మరించారు. వార్డుల వారీగా ఓటర్లను ఇష్టారీతిన కేటాయించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు, ఒకే ప్రాంతంలో నివసించే ఓటర్లను వేర్వేరు వార్డులు, చివరికి మూడు నుంచి నాలుగు విభిన్న పోలింగ్ స్టేషన్లకు బదలాయించారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నెలకొన్న ఈ పరిస్థితిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అయోమయంలో ప్రజలు

ఒకే కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే పోలింగ్ కేంద్రం లేదా ఒకే వార్డు పరిధిలోకి తేవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో వీటి అమలుకు అధికారులు నీళ్లొదిలారు. వీరబల్లి మండలంలోని సానిపాయి, మట్లి గ్రామాలతో పాటు జిల్లాలోని పలు పంచాయతీల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గత ఎన్నికల సందర్భంగా రూపొందించిన జాబితా వరకు ఒకే ప్రాంతంలో ఉన్న ఓటర్లను ఇప్పుడు ఏ ప్రాతిపదికన విడదీశారో తెలియక ప్రజలూ అయోమయంలో పడ్డారు.

వినియోగానికీ తప్పని వెతలు

ఒకే ఇంటి నంబరు ఉన్న కుటుంబంలో తల్లిదండ్రులు ఒక వార్డులో ఉంటే, పిల్లలను మరొక వార్డు లేదా పోలింగ్ కేంద్రంలో చేర్చారు. ఒకే వీధికి చెందిన ప్రజలను 3 నుంచి 4 వేర్వేరు వార్డులుగా వర్గీకరించడం వల్ల ప్రజా ప్రాతినిధ్యం, వార్డు సరిహద్దులపై గందరగోళం తలెత్తుతోంది. ఓటు వేయడానికి ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో సమయం వృథా కావడమే కాకుండా ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

అధికారులకు వినతిపత్రాలు

లోపభూయిష్టమైన సర్దుబాటుపై పలు ప్రాంతాల నుంచి ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పందించారు. ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా వినతిపత్రాలు సమర్పించారు. ముసాయిదా జాబితా ఆధారంగా తుది జాబితా ప్రచురించే లోపే అధికారులు స్పందించి, ఒకే ఇంట్లోని ఓటర్లను ఒకే వార్డు పరిధిలోకి తీసుకురావాలని, భౌగోళిక సరిహద్దులను పునఃసమీక్షించాలని ఓటర్లు కోరుతున్నారు.

బాధ్యత లేని వారికి ఆస్తులూ వద్దు

తండ్రికి తిరిగి హక్కులు కల్పిస్తూ ఆర్డీవో తీర్పు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: అతను జీవితాంతం శ్రమించారు. కుమారులకు విద్యాబుద్ధులు నేర్పించారు. పెళ్లిళ్లు చేసి ఓ ఇంటిని వారిని చేశారు. వృద్ధాప్యంలో తనను సంరక్షిస్తారని కూడగట్టిన ఆస్తులు రాసిచ్చారు. ఆస్తి దక్కాక కుమారుల మనసు మారింది. ఆ తండ్రి బాగోగులు చూడాలనే విషయాన్ని మరిచారు. దీంతో తన ఆస్తి తనకు తిరిగిచ్చేలా చూడాలని ఆ వృద్ధుడు అధికారులను ఆశ్రయించడంతో ఆర్డీవో అతనికి న్యాయం చేశారు.

ఆస్తి పత్రాలను ఆత్మకూరు రామిరెడ్డికి అందజేస్తున్న ఆర్డీవో శిరీష

● **గిఫ్ట్ డీడ్ రద్దు:** ప్రొద్దుటూరు మండలం బొల్లవరానికి చెందిన బండి ఆత్మకూరు రామిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసి పిల్లలను పెంచి పెద్ద చేశారు. 2018లో భార్య మృతి చెందారు. అనంతరం ఆస్తిని 2019లో గిఫ్ట్ డీడ్ కింద కుమారులకు రాసిచ్చారు. వృద్ధాప్యంలో సంరక్షణ, ఆహారం, వైద్య సహాయం అందిస్తారనుకుంటే.. అతన్ని పట్టించుకోవడం మరిచారు. కాటికి పోయే రోజుల్లో కుమారులు క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన చెందారు. ఫిర్యాదు అందుకున్న జమ్మలమడుగు ఆర్డీవో శిరీష క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గిఫ్ట్ డీడ్‌లు, ఆధార్ కార్డులు, వైద్య పత్రాలు, చుట్టుపక్కల వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆస్తి బదిలీ ఒప్పందాలను రద్దు చేశారు. ఈ మేరకు సోమవారం తుది ఉత్తర్వులు వెల్లడించడంతో పాటు ఆస్తి పత్రాలను రామిరెడ్డికి అందించారు. వయో వృద్ధులను విస్మరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

కృష్ణాష్టమికి కొబ్బరికాయ.. విజయదశమికి గుమ్మడికాయ

మినీ గోకులాల నిర్మాణానికి చర్యలు

కడప, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు పశువుల పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందులతో షెడ్లు నిర్మించుకోలేరు. దీంతో వర్షం వస్తే పశువులు తడుస్తున్నాయి. శీతాకాలంలో చలికి వణికిపోతున్నాయి. వేసవిలో వేడికి అల్లాడిపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వీబీ జీ రామ్‌జీ పథకం అమలులో భాగంగా పశు పోషకులకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్లు ఉన్న వారికి 70 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది.

ఒక్కో మండలానికి 12 - 14

పల్లె పండగ 3.0 అమలులో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 513 మినీ గోకులం యూనిట్లు మంజూరయ్యాయి. దీంతో ఒక్కో మండలానికి 12-14 యూనిట్లు కేటాయించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. పాడి రైతులు, జీవాలు, కోళ్ల పెంపకందారుల నుంచి అందే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని అదనపు యూనిట్లూ మంజూరు చేయనున్నారు. గతంలో లబ్ధిదారుల వాటా ముందస్తుగా చెల్లించాల్సి ఉండేది. చాలా మందికి ఈ సొమ్ములు కట్టలేక పోతున్నట్లు పాలకులు గుర్తించారు. దీంతో నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత బిల్లుల చెల్లింపు సమయంలో రైతు వాటాను మినహాయించి మిగిలిన మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు.

మినీ గోకులం యూనిట్ విలువ, లబ్ధిదారుల వాటా సమాచారం...

విభాగం	యూనిట్ విలువ	లబ్ధిదారుల వాటా (రూ.లలో)
2 పశువులు	1,15,000	15,000
4 పశువులు	1,85,000	18,500
6 పశువులు	2,00,000	20,000
50 జీవాలు	2,00,000	60,000
100 కోళ్లు	87,000	26,100

క్షేత్రస్థాయిలో పరిశీలన

పల్లె పండగ 3.0 పనులకు ఈ నెల 4న కృష్ణాష్టమి వేళ భూమి పూజకు కొబ్బరికాయ కొట్టాలని, వచ్చే నెల 20న విజయదశమి(దసరా) నాటికి పూర్తి చేసి గుమ్మడికాయ కట్టాలనే లక్ష్యాన్ని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఇప్పటికే పశు పోషకుల నుంచి అందిన దరఖాస్తులను పశుసంవర్ధక శాఖ, వీబీ జీ రామ్‌జీ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గతంలో లబ్ధి పొందని కుటుంబాలకు వర్తింపజేయాలని నిబంధన దృష్ట్యా.. ఇదివరకు మినీ గోకులం దక్కని ఆశావహులు ఈసారైనా మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు.

విద్యుత్తు బస్సులు.. రోడ్డెక్కనున్నాయ్

రెండు నెలల్లో అందుబాటులోకి సేవలు

'న్యూస్‌టుడే'తో కడప ఆర్టీసీ ఈడీ కిశోర్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు బస్సు సర్వీసులను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా కడప ఆర్టీసీ జోన్(ఎనిమిది జిల్లాలు)కు 200, కడప జిల్లాకు 50 కేటాయించాయి. వీటిని రానున్న రెండు నెలల్లో రోడ్డెక్కించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందుకు అవసరమైన ఛార్జింగ్ కేంద్రాలు, సబ్ స్టేషన్లు, సివిల్ పనులు శరవేగంగా సాగుతున్నట్లు కడప ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిశోర్ తెలిపారు. ఆయన సోమవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు...

జిల్లాకు రూ. 10 కోట్లు

జిల్లాకు రూ. 10 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. వీటితో నాలుగు డిపోల్లో సివిల్, ఎలక్ట్రికల్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. సివిల్ పనులకు మాత్రం 60 శాతం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను భరిస్తోంది. 24 గంటల పాటు విద్యుత్తు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. పది ఛార్జింగ్ మిషన్ల ఏర్పాటు, పార్కింగ్‌కు ప్రత్యేక భవనాలు, మెకానిక్ షెడ్లు వంటి నిర్మిస్తున్నారు.

ఇప్పటికే వైజాగ్‌లో అమలు

జిల్లా ప్రధాన కేంద్రాలైన కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి డిపోలకు 50 చొప్పున మొత్తం 200 విద్యుత్తు బస్సులు రానున్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు వైజాగ్ ప్రాంతంలో నడుస్తున్నాయి. ఒక్కో బస్సులో 35 మంది ప్రయాణించేందుకు వీలుంది. విద్యుత్తు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందా లేదా అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

పట్టాభిషేకం.. సాంస్కృతిక సంబరం

కడప విద్య, న్యూస్‌టుడే: పట్టాభిషేకం(ఇన్వెస్టిచర్) కార్యక్రమాన్ని కడప నగరం రామరాజుపల్లెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేశభక్తి గేయాలు ఆలపించారు. భరతనాట్యం, కూచిపూడి నృత్యంతో అలరించారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమెక్కువ

ఇలా పరిశుభ్రంగా ఉండే ఊళ్లకు అవార్డులు దక్కనున్నాయి...

గ్రామ పంచాయతీల మధ్య పోటీ

కమలాపురం, న్యూస్‌టుడే: గ్రామాల్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా మార్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే ఘన వ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయి. ప్లాస్టిక్‌ను తరిమేసేందుకు స్వచ్ఛ రథాలను తెచ్చాయి. అయినా గ్రామాల్లో అపరిశుభ్రత, అధ్వాన పారిశుద్ధ్యం ఇంకా తాండవిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛతలో గ్రామ పంచాయతీల మధ్య పోటీకి కూటమి ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు- 2026 పేరుతో పోటీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్రస్థాయిలో ఆరు, జిల్లాస్థాయిలో ఐదు అవార్డులు ఇవ్వనుంది. ఈ మేరకు మండల, గ్రామస్థాయి అధికారులకు ఇప్పటికే మార్గదర్శకాలందాయి.

● **కార్మికులకూ చోటు:** తొలిసారి స్వచ్ఛ దూతలకు(పారిశుద్ధ్య కార్మికులు) కూడా పోటీలో పాల్గొనే అవకాశం కల్పించింది. వీరికి రాష్ట్రస్థాయిలో మూడు, జిల్లా స్థాయిలో ఐదు అవార్డులు ఇవ్వనుంది. విధులపై శ్రద్ధ, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణలో ఆదర్శ పద్ధతులు, వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించడం, బాధ్యతగా పని చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఆన్‌లైన్‌లో కార్మికులు తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాస్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపిక చేస్తాయి. అవార్డులో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

ఇవీ పరిశీలన అంశాలు

● గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల శుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ, సేంద్రీయ వ్యర్థాల నిర్వహణ, తోటల పెంపకం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాల్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.

వరదా.. కష్టం కాలేదు వృథా

ప్రధాని నోట సీమ రైతు మాట

లింగాల, న్యూస్‌టుడే: అతను లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన ఓ యువ రైతు. పేరు కర్ణ వరదా రెడ్డి. పదో తరగతి వరకు చదివి అనుకోని పరిస్థితుల్లో వ్యవసాయాన్ని వారసత్వంగా తీసుకున్నారు. అరటి, టమాట పంటలు పండించి వరుసగా నష్టాలు చవిచూశారు. అయినా అతను కుంగిపోలేదు. నష్టాల నుంచి గట్టెక్కడమే కాకుండా.. సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పది మందికి మార్గం చూపాలని ఆలోచించారు.

మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రశంసించడంతో రైతు వరదారెడ్డికి మిఠాయి తినిపిస్తున్న గ్రామస్థులు

మన్ కీ బాత్‌లో ప్రశంస

రాయలసీమ నేలల్లో విదేశీ పండ్లు పండవనే నమ్మకాన్ని వరదారెడ్డి తిరగరాశారు. అతని శ్రమ, విజయ గాథను గుర్తించిన భారత ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో మెచ్చుకున్నారు. మార్కెట్‌కు అనుగుణంగా కొత్త రకం పంటలు వేస్తే చిన్న కమతాల నుంచే అద్భుతమైన ఆదాయం పొందవచ్చని అతను నిరూపించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కష్టాలను ఎదుర్కొని కొత్తగా ఆలోచించే ప్రతి భారతీయ రైతు విజయంగా వరదా రెడ్డి విజయం ఇప్పుడు మారింది.

శోధన.. పరిశీలన

రాయలసీమ వాతావరణాన్ని తట్టుకుని తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంట కోసం వెతికారు. విదేశీ పంట అయిన అవకాడో గురించి మిత్రుడి సూచనతో తెలుసుకుని యూట్యూబ్ వేదికగా అధ్యయనం చేశారు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రం కూర్గ్ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మన నేలలో పండించాలని నిర్ణయించుకున్నారు.

అవకాడో పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు..చిత్రంలో రైతు వరదారెడ్డి

పండిన శ్రమ

మన వాతావరణానికి దిగుబడులు రావంటూ చాలామంది నిరుత్సాహపరిచారు. అతను మాత్రం సవాలుగా తీసుకుని సంకల్పంతో సాగుకు ముందుకు కదిలారు. బిందు సేద్యం, సేంద్రియ ఎరువులతో రెండు ఎకరాల్లోని పంటను నాలుగేళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. శ్రమ ఫలించి అవకాడో పండ్లు గుత్తులుగా కాశాయి. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంట కావడంతో దళారుల ప్రమేయం లేకుండా ఐదు టన్నుల మేర విక్రయించారు. ఆ కష్టమే ఇప్పుడు అతని విజయాన్ని దిల్లీ వరకు పాకేలా చేసింది.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప : ✆ 99899 97626

(c) eenadu

ఎల్‌నినో ప్రభావం... ప్రత్యుత్పత్తిలో జాగ్రత్తలు అవసరం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వాతావరణంలో తీవ్రమైన వేడి, అధిక తేమ శాతం ఆవు, మగ పశువుల ప్రత్యుత్పత్తి అవయవాలపై ప్రభావం చూపిస్తాయి. ఎద లక్షణాలు, ఎదకు ఉండే సమయం, అండాశయంలో పెరిగే అండాల సంఖ్య పరిమాణం తగ్గిపోవడంతో అండం విడుదల శాతం తగ్గిపోతుంది. ఈస్ట్రోజన్ వంటి జీవరసాయనాలు తగ్గిపోతాయి. దీని వల్ల బీజకణాలు కదలిక మందగించి, ఫలదీకరణ, కట్టు శాతం తగ్గిపోతుంది. దీంతో గర్భధారణ శాతం 40-60 శాతం నుంచి 10-20 శాతం వరకు తగ్గిపోయే ప్రమాదముంది. అధిక వేడి వల్ల కణ విభజన జరిగి సక్రమంగా పిండ మరణాలు సంభవిస్తాయి.

● అంబోతు మీద కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రత కంటే వృషణాలు 2-6 డిగ్రీల సెంటిగ్రేడ్ తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే నాణ్యత కలిగిన వీర్యకణాలు తయారవుతాయి. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య కళాశాల సహాయ ఆచార్యులు డాక్టరు జ్యోతి తెలియజేస్తున్నారు. ● జన్యు పరంగా ఉష్ణతాపాన్ని సమర్థంగా తట్టుకునేగల ఒంగోలు వీర్యాన్ని ఉపయోగించడంతో పలు యాజమాన్య పద్ధతులను పాటించి పశువుల్లో అధిక వేడిని తగ్గిస్తే పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. ● తగినంత పచ్చిమేత, నీరు సమకూర్చాలి. ● ఎద లక్షణాలను తరచూ గమనించాలి. ఖనిజ లవణ మిశ్రమాన్ని ప్రతి రోజు 30-50 గ్రాములు ఇవ్వాలి. ● పాకను శుభ్రంగా ఉంచి ఫ్యాన్లు లేదా స్ప్రింక్లర్లు వంటివి వినియోగించాలి. ● పశువులను చల్లటినీటితో శుభ్రపరచాలి. ● శరీర ఉష్ణోగ్రతను అదుపులోకి తీసుకువస్తే గర్భధారణ జరిగి పిండం ఏర్పడి కణవిభజన సక్రమంగా జరుగుతుంది. జీవరసాయనాలు కూడా సక్రమంగా విడుదల అవుతాయి. ● ఇలా చేస్తే ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా పశువుల పునరుత్పత్తి సామర్థ్యాన్ని పరిరక్షించుకోవచ్చు.

వరిలో జింక్ లోపం ఇలా అధిగమిద్దాం

రైతేరాజు

కమలాపురం, ఒంటిమిట్ట, పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం వరి పంటను కొన్నిచోట్ల సాగు చేశారు. ఈ నేపథ్యంలో అన్ని దశల్లో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు చల్లుతున్నారు. ఇలా చేయడం వల్ల పోషకాల సమతుల్యత లోపిస్తుంది. జింకు తక్కువగా ఉండటంతో పంట ఎదుగుదల, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను గుర్తించి సవరిస్తే అధిక లాభాలు పొందవచ్చని కమలాపురం మండల వ్యవసాయ అధికారిణి సరస్వతి, ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.సాయిమహేశ్వరి సూచించారు. ● వరిలో జింకు లోపం వచ్చినప్పుడు నాటిన 2-6 వారాల మధ్య పైనుంచి 3, 4వ ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. పత్రం చివరల్లో, మధ్య ఈనెకు ఇరువైపులా ఇటుక రంగు లేదా తుప్పు రంగు మచ్చలు కన్పిస్తాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా తయారై పట్టుకుంటే విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి సరిగ్గా దుబ్బు కట్టవు. పిలకలు తక్కువగా వస్తాయి. ఎంత నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చబడదు. ఇది చల్లని వాతావరణం ఉన్నప్పుడు బాగా కన్పిస్తుంది. జిల్లాలో ఉన్న నేలలు ఎక్కువగా క్షార స్వభావం కలిగి ఉన్నాయి. ఇక్కడి భూమి పీహెచ్ 7.5 నుంచి 8.5 వరకు ఉంటుంది. అధిక పీహెచ్ ఉన్న భూముల్లో వేసిన జింకు నేలలోనే గట్టిపడి మొక్కలకు అందదు. భాస్వరం అధికంగా ఉంటే అది జింకు లభ్యతను తగ్గిస్తుంది. ఒకే వరి పంట పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు కార్లు పండించేట్లయితే ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేటు వేయాలి. పైరులో లోప లక్షణాలు కనిపించగానే లీటరు నీటికి 3 గ్రాముల జింకు సల్ఫేటు, 5 గ్రాముల యూరియా కలిపి 5 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి. క్షార నేలలకు చీలేటెడ్ జింకు 12 శాతం లీటరుకు 0.5 గ్రాముల నుంచి 1 గ్రాము చొప్పున 20-25 రోజుల దశలో రెండుసార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. జింకు సల్ఫేటును భాస్వరం ఎరువులతో కలిపి వేయరాదు. కనీసం మూడు రోజుల వ్యవధిలో ఉండాలి. అలాగే జింకు ద్రావణంలో పురుగు మందులు లేదా తెగుళ్ల మందులను కలిపి వాడరాదని సూచించారు.

జీవిత బీమా.. ఆర్థిక ధీమా!

● అందుబాటులో 35 రకాల పాలసీలు
● నేటి నుంచి ఎల్‌ఐసీ వారోత్సవాలు

కడప ఏడురోడ్లు, విద్య, న్యూస్‌టుడే : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) ఏడు దశాబ్దాలుగా ప్రజల అభిమానాన్ని పొందుతోంది. 1956లో ముంబయి కేంద్రంగా ప్రారంభమైన ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ.. ఎప్పటికప్పుడు ప్రజలకు ఉపయోగపడే కొత్త పాలసీలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రజల నమ్మకమే భరోసాగా నిలుస్తోంది. కడప కేంద్రంగా 1980లో ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ డివిజనల్ కార్యాలయం పరిధిలోకి ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు వస్తాయి. మొత్తం మీద కడప డివిజనల్ పరిధిలో 20 బ్రాంచ్ కార్యాలయాలు, 14 శాటిలైట్ ఆఫీసులు పనిచేస్తున్నాయి. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోకి వస్తే మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, రైల్వేకోడూరు, రాయచోటి కేంద్రాల్లో శాటిలైట్ ఆఫీసులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

కడప ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం

కడప డివిజనల్‌లో 25 లక్షలకు పైగా

కడప డివిజనల్ పరిధిలో 25 లక్షలకు పైగా జీవిత బీమా పాలసీదారులు ఉన్నారు. అలాగే 14 వేలకు పైగా ఏజెంట్లు పనిచేస్తున్నారు. పుట్టిన బిడ్డ నుంచి 100 సంవత్సరాల వృద్ధుల వరకు అన్ని వయసుల వారికి సరిపోయే విభిన్న పాలసీలు కలిగి ఉండటం ఎల్‌ఐసీ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఎటువంటి కాగితాలు, భౌతిక సంతకాలు లేకుండా పూర్తిగా ఆన్‌లైన్‌లో పేపర్ రహిత విధానంలో పాలసీలను తీసుకునే వెసులుబాటును యాప్ ద్వారా ఏజెంట్లకు కల్పించారు.

మై ఎల్‌ఐసీ యాప్ ద్వారా సేవలు

పాలసీదారుల కోసం 'మై ఎల్‌ఐసీ' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఖాతాదారులు వివిధ రకాల సదుపాయాలు, సేవలు పొందొచ్చు. పాలసీ బాండ్ లేకుండానే లక్ష రూపాయల వరకు లోన్ తీసుకునే సదుపాయాన్ని కూడా కల్పించారు.

కుటుంబాలకు రక్షణ కవచాలు

ఎల్‌ఐసీ సంస్థలో ఎండోమెంట్, మనీ బ్యాక్, హోల్ లైఫ్, చిల్డ్రన్స్, టర్మ్, పెన్షన్, యూఎల్‌ఐపీ, మైక్రో పాలసీలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం మీద 35 రకాలు పాలసీలు పొందవచ్చు. అనేక ప్రైవేటు రంగ సంస్థలు ఉన్నప్పటికీ ఎల్‌ఐసీ సంస్థపై ప్రజలకు అపార నమ్మకం ఉండడంతో.. కుటుంబంలో ఒక్కరైనా ఎల్‌ఐసీ పాలసీని కలిగి ఉండటం విశేషం. వికసిత్ భారత్-2047 ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్కరికీ బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోంది.

నేటి నుంచి పోటీలు, సమావేశాలు

ఎల్‌ఐసీ వారోత్సవాల సందర్భంగా కడప కలెక్టరేట్ సమీపంలోని ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయంలో సెప్టెంబరు 1న ప్రత్యేక సమావేశాన్ని చేపట్టి వారోత్సవాలను ప్రారంభించనున్నారు. 2న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు.. 3న గురు దివస్ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఎల్‌ఐసీ ఉద్యోగులకు సత్కరించనున్నారు. అదే రోజున కడపలో ఎల్‌ఐసీ అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులతో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. 4న వైద్య శిబిరం, 5న నగరంలోని పలు వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, 7న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారోత్సవాలను ముగించనున్నట్లు కడప డివిజన్ అధికారులు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ నిధిమీనా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసి అర్జీల రూపంలో తమ సమస్యలు అధికారులకు తెలియజేశారు. జేసీ నిధిమీనా మాట్లాడుతూ. . అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం ఆలస్యం అయ్యేలా ఉంటే ఆ విషయాన్ని అర్జీదారుడుకు తెలియజేయాలన్నారు. డీఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, శివరామిరెడి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారు నుంచి వినతి స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టరు నిధిమీనా

నిర్ణీత సమయంలో కేసులు పరిష్కరించాలి

కడప నేర వార్తలు, న్యూస్‌టుడే: నిర్ణీత సమయంలో కేసులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ పోలీసులకు సూచించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్పీ వినతులను పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు వాటిని బదలాయించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఏదైనా సమస్యలు పోలీసుల దృష్టికి తీసుకొస్తే స్పందించాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు సకాలంలో పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 117 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

ఆకు కూరల సాగులో భళా

లింగాల, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకు కూరలు, కూరగాయలు విక్రయిస్తూ లింగాల మండలం రామన్నూతలపల్లెకు చెందిన ఎమ్.అరుణ ఆర్థిక స్వావలంబన సాధిస్తూ తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువుల ఖర్చులు పెరగడంతో తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఆదాయం ఇచ్చే ఆకు కూరల సాగు ఎంచుకుని ఆదాయం సంపాదిస్తున్నారు.

● **మూడు ఎకరాల్లో..:** తనకున్న మూడు ఎకరాల పొలంలో రెండు ఎకరాల్లో మొక్క జొన్న. అర ఎకరా విస్తీర్ణంలో ఆకు కూరలు, కూరగాయల సాగు చేపట్టారు. పండించిన ఆకుకూరలను పులివెందుల స్మార్ట్‌కిచెన్‌కు ప్రతి శుక్రవారం 70 కట్టలు రవాణా చేస్తున్నారు. కట్ట రూ.10 చొప్పున రూ.700 ఆదాయం వస్తోంది. ఇలా నెలలో నాలుగు సార్లు రూ.2,800 ఆదాయం సమకూరుతోంది. దీన్ని రూ.10 వేలకు పెంచడానికి ఆకు కూరల సాగు పెంచారు. బీర, కాకర, బెండ, ముల్లంగి, మొటిక, అలసందలు సాగు, ఆకు కూరల సాగుతో నెలకు రూ. 20 వేల మేర ఆదాయం పొందుతున్నారు. రెండు ఎకరాల్లోని మొక్కజొన్నకు జీవామృతం, సేంద్రియ ఎరువులు వాడటంతో ఏపుగా పెరిగింది. మరో నెల రోజుల్లో దిగుబడులు అందనున్నాయి. క్వింటా ధర రూ. 2 వేలు పలుకుతోంది. 60 క్వింటాళ్ల దిగుబడులు రానున్నాయి. రూ.1.20 లక్షల ఆదాయం రానుంది. సొంత కాళ్లపై నిలబడటంలో ఉండే తృప్తి వేరు. ఆకు కూరల సాగు నా కుటుంబ రూపురేఖలను మార్చేసిందని అరుణ తెలిపారు. ఆమె తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఆకు కూర తోటలో రైతు అరుణ

ప్రశ్న: జీవాల్లో కాలిపుండు వ్యాప్తి ఉంది. అవి నడవలేకపోతున్నాయి. వ్యాధి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.?

- శివశంకర్‌రెడ్డి, కమలాపురం

సమాధానం: వర్షాలు కురిసే సమయంలో గొర్రెలు సాధారణంగా కాలిపుండ్ల వ్యాధితో ఇబ్బంది పడుతుంటాయి. నడవలేక కుంటుతుంటాయి. ఈ వ్యాధి సూక్ష్మజీవుల కారణంగా వ్యాప్తి చెందుతుంది. చిత్తడి నేలలపై మంద తిరిగినప్పుడు ఈ లక్షణాలు ఎక్కువగా కన్పిస్తుంటాయి.

వ్యాధి లక్షణాలు: గొర్రెల కాలి గిట్టల మధ్యలో ఎర్రగా కందుతుంది. మేత సరిగా మేయవు. బరువు తగ్గిపోతుంటాయి. ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పట్టి దుర్వాసన వస్తుంది. వ్యాధి తీవ్రత కారణంగా గిట్టలు ఊడిపోయే ప్రమాదముంది.

చికిత్స: వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం మైలతుత్తం ద్రావణం లేదా 10శాతం జింకు సల్ఫేట్ ద్రావణం లేదా ఫార్మాలిన్ ద్రావణంతో రోజుకు రెండు దఫాలు శుభ్రం చేయాలి. పశువైద్యుని సలహా మేరకు యాంటిబయోటిక్ ఆయింట్‌మెంట్ కొద్ది రోజులు పూయాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి ఇంటి వద్దనే ఉంచాలి. మందను చిత్తడి నేలలు, నీళ్లు నిలిచే ప్రదేశాల్లో నిలపకుండా ఎత్తైన ప్రదేశాల్లో నిలపాలి.

- మల్లికార్జునరెడ్డి, పందిళ్లపల్లె పశువైద్యాధికారి, కమలాపురం మండలం

- న్యూస్‌టుడే, కమలాపురం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

కలకలం రేపిన సుపారీ హత్య

వీరబల్లి, న్యూస్‌టుడే: భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని ఎలాగైనా హతమార్చాలని భర్త పథకం పన్నాడు. తాను స్థానికంగా లేక పోయినా హత్య చేసే వారితో సుపారీ కుదుర్చుకుని హత్య చేయించారు. ఈ ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. వీరబల్లి మండలం ఓదివీడుకు చెందిన షేక్ షాహిదా, కడప మోచంపేటకు చెందిన షేక్ నజీంబాషా దంపతులు. వీరికి కుమార్తె సంతానం. జీవనోపాధి నిమిత్తం పదేళ్ల కిందట భార్యాభర్తలిద్దరూ.. కువైట్‌కు వెళ్లారు. అక్కడ వరుసకు పిన్ని కుమారుడైన షేక్ ఖాసీం కూడా వారితో కలిసి మెలసి మెలిగే వారు. ఆ సమయంలోనే భార్య షాహిదాతో ఖాసీం వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, భర్త నజీం అనుమానం పెంచుకున్నాడు. ఈ పరిస్థితుల్లో భార్య షాహిదా నాలుగేళ్ల కిందట తిరిగి ఓదివీడుకు వచ్చారు. ఇటీవల ఖాసీం కూడా తన స్వగ్రామమైన మోచంపేటకు వచ్చారు. ఈ క్రమంలో అతను తరచూ.. ఓదివీడుకు వచ్చి వెళ్లే వారు. ఈ విషయం తెలుసుకున్న భర్త నజీం బాషా అతడ్ని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. కడపకు చెందిన బాబ్జి, ఖాదర్‌వలీలతో సుపారీ కుదుర్చుకున్నారు. ఖాసీం శనివారం ఓదివీడుకు వచ్చిన విషయాన్ని గమనించిన నిందితులిద్దరూ.. షాహిదా ఇంటికి వెళ్లారు. ఖాసీం, షాహిదా ఇంట్లో ఉండడం గమనించి, లోపలికి వెళ్లి గడియ పెట్టారు. ఇద్దరిని చితకబాది షాహిదాను బయటకు తోసేసారు. ఖాసీంను కర్రలు, ఇతర ఆయుధాలతో హత్య చేశారు. చుట్టుపక్కల వారు గమనించి బాబ్జిని అడ్డుకున్నారు. ఖాదర్‌వలీ పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలను త్వరలో మీడియాకు తెలియజేస్తామని ఎస్సై సుస్మిత తెలిపారు.

కువైట్ నుంచి వచ్చిన రెండు నెలలకే మృతి

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం వదరయ్యగారిపల్లి గ్రామానికి చెందిన సురేష్(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు మన్నూరు సీఐ లింగప్ప తెలిపారు. పోలీసులు వివరాల మేరకు.. సురేష్ సోమవారం వదరయ్యగారిపల్లి నుంచి బ్రాహ్మణపల్లిలో ఉన్న తన పొలం వద్దకు ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. మార్గ మధ్యలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతన్ని గమనించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, పరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతను కువైట్ నుంచి వచ్చిన రెండు నెలలకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై కేసు నమోదు చేసినట్లు మన్నూరు పోలీసులు చెప్పారు.

కామనేని సురేష్ (పాత చిత్రం)

రోడ్డు ప్రమాదంలో బేల్దారీ..

ప్రొద్దుటూరు నేరవార్తలు: ప్రొద్దుటూరు పట్టణంలోని బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో దువ్వూరుకు చెందిన ఇబ్రహీం (28) మృతి చెందినట్లు గ్రామీణ ఠాణా ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఇబ్రహీం బేల్దారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ బైక్‌లో దువ్వూరు నుంచి ప్రొద్దుటూరు వస్తుంటారు. సోమవారం కూడా బేల్దారీ పని నిమిత్తం ప్రొద్దుటూరు వచ్చారు. పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బైపాస్ రోడ్డులో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. వెనుక వైపు వస్తున్న ఇబ్రహీం బైక్ అదుపు తప్పి ముందున్న వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ప్రొద్దుటూరులో గుర్తు తెలియని వ్యక్తి..

ప్రొద్దుటూరు నేరవార్తలు: ప్రొద్దుటూరు పట్టణం త్యాగరాజరెడ్డి ఆసుపత్రి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మూడో పట్టణ ఠాణా పోలీసులు సోమవారం తెలిపారు. మూర్ఛ రావడంతో కిందపడి చనిపోయినట్లు గుర్తించారు. మృతుడు ఎవరన్నది తెలియరాలేదు. మృతదేహాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే ఠాణాలో సంప్రదించాలని తెలిపారు.

12న జాతీయ లోక్ అదాలత్

కడప లీగల్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్ తెలిపారు. సోమవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు న్యాయసేవలు ఎంతో అవసరమన్నారు. గత జులై 11వ తేదీ నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,05,798 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రజలకు లోక్ అదాలత్ ప్రయోజనాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసు శాఖ, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో మల్లికార్జునుడు

జిల్లా ప్రధాన జడ్జిని కలిసిన అధికారులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి.రామగోపాల్‌ను సోమవారం అధికారులు కలిశారు. డీఆర్వో కె. మల్లికార్జునుడు, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన, రెండో తరగతి మేజిస్ట్రేట్లు, రాజంపేట తహసీల్దారు దస్తగిరి, జిల్లా అటవీ అధికారి టి.రాజశేఖర్ బాబు, స్పెషల్ మహిళా జైలు సూపరింటెండెంట్ కృష్ణవేణి, జైలర్ భువనేశ్వరి కలిసి మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

లోక సుభిక్షం కోసమే ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సిద్దవటం, న్యూస్‌టుడే: లోకసుభిక్షం కోసమే ఆలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపడుతున్నామని శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్ నాయుడు, ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, విజయ్‌కుమార్ అన్నారు. శ్రీశైల దేవస్థానానికి దత్తత కోవెలైన సిద్దవటంలోని శ్రీకామాక్షి సమేత సిద్దవటేశ్వస్వామి కోవెలలో సోమవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం మూడో రోజు కొనసాగింది. పలురకాల పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ఆలయ ఎదుట వైభవోపేతంగా ప్రతిష్ఠించారు. అనంతరం బలిహరణ, పూర్ణాహుతి, అవభృథం, మహదాశీర్వచనం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు దంపతులు, మండలి సభ్యులు భరద్వాజశర్మ, రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ, తెదేపా నాయకులు మోహన్‌రెడ్డి, దశరథరామనాయుడు, రాజశేఖర్, నాగమునిరెడ్డి, ఓబులయ్య, భాజపా నాయకులు సుబ్రమణ్యం, భాస్కర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఛైర్మన్ రమేష్ నాయుడు, పక్కన పలువురు సభ్యులు, నాయకులు

ఎల్‌నినోతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం

సీకే దిన్నె, కడప (చిన్నచౌకు), న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం అధికారి డాక్టరు జి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు కేవీకేలో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులు - శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలిచ్చారు. జిల్లాలో వర్షపాతం 75 శాతం తక్కువగా నమోదైందన్నారు. కరవు పరిస్థితుల దృష్ట్యా నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి, ఆత్మ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యేశ్వరరావు, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, కృష్ణప్రియ, మాధురి, శ్రీవల్లి, యాస్మిన్, మహేష్‌బాబు, సాయిమహేశ్వరి, మానస, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి.. చిత్రంలో శాస్త్రవేత్తలు, అధికారులు

వీఆర్‌కు ఇద్దరు పోలీసులు

స్పందనకు వందనం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అవినీతికి పాల్పడుతున్న ఇద్దరు పోలీసులను ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో వీఆర్‌కు పంపారు. రాజంపేట పట్టణం మన్నూరు పోలీసు స్టేషన్‌లో జరుగుతున్న అవినీతిపై గత నెల 25న 'మన్నూరు ఆ ఇద్దరు చెప్పినట్టే ఆడు' అన్న శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు కానిస్టేబుల్ అంజిరెడ్డి, హోంగార్డు నాయుడును వీఆర్‌కు బదిలీ చేశారు.

రెండు రోజుల పాటు పులివెందులలో జగన్

కడప ఏడురోడ్లు, పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబరు 1న మధ్యాహ్నం 12 గంటలకు పులివెందులకు చేరుకోనున్నారు. అనంతరం భాకరాపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. రాత్రికి పులివెందులలోని తన నివాసంలో బస చేయనున్నారు. 2వ తేదీ పులివెందుల నివాసం నుంచి బయలుదేరి ఉదయం 7.45 గంటలకు ఇడుపులపాయకు వచ్చి.. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించనున్నారు. అనంతరం బెంగళూరుకు వెళ్లనున్నారు.

అల్లర్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

ఈనాడు, దిల్లీ: అల్మాస్‌పేట్‌లో మే9న చోటుచేసుకున్న ఉద్రిక్తతల్లో.. పోలీసు ఇన్‌స్పెక్టర్‌పై దాడిచేసిన కేసులో నిందితుడిగా ఉన్న షేక్ జాఫర్ ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ జులై 7న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ.. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవల ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది ప్రేరణాసింగ్ వాదనలు వినిపించారు. ఇందుకు జస్టిస్ సంజయ్ కుమార్ స్పందిస్తూ.. దాడి సమయంలో పిటిషనర్ గుంపులో ఉన్నారన్న కారణంతో నిందితునిగా చేర్చడం ఆమోదయోగ్యం కాదని.. సరైన ఆధారాలు చూపాలని పేర్కొన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ తమకు నోటీసులు జారీచేస్తే ఆధారాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం హర్షణీయం

వేంపల్లె, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం హర్షణీయమని, అయితే సింహ భాగం పనులు పూర్తయింది కాంగ్రెస్ హయాంలోనే అని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీ కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అన్ని పార్టీల కృషి, భాగస్వామ్యం ఉందన్నారు. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో క్షామ పీడిత ప్రాంతాలకు సాగునీరు, ఫ్లోరైడ్ బాధిత ప్రజలకు తాగునీరందించేందుకు వెలిగొండ ప్రాజెక్ట్‌ను నిర్మించాలని కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పూల సుబ్బయ్య నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. అందుకే కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం చేశారన్నారు. ప్రస్తుతం తొలి ఫేజ్ మాత్రమే పూర్తయిందని, రెండో ఫేజ్ కూడా పూర్తి చేస్తేనే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుందన్నారు.

ప్రమాదాల నియంత్రణపై దృష్టి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి భద్రత చర్యలను పటిష్ఠంగా చేపట్టి ప్రమాదాలను గణనీయంగా నియంత్రించాలని డీఆర్వో మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌హెచ్-67, ఎన్‌హెచ్-716 ప్రాంతాలు అత్యంత ప్రమాదకర మార్గాలుగా గుర్తించామన్నారు. గుర్తించిన 338 ప్రాంతాల్లో రహదారి భద్రతా లోపాలను ప్రాధాన్య క్రమంలో సరిచేయాలన్నారు. ముఖ్యంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. ఈ సమయాన్ని ప్రత్యేక ప్రమాద నియంత్రణ కాలంగా పరిగణించి పోలీసు, రవాణా, రహదారుల శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలతో నియంత్రించాలని సూచించారు. వేగ నిరోధకాలు, సూచికలు, గుంతల వద్ద హెచ్చరికలు, సౌర విద్యుత్తు దీపాలు, రహదారి సూచిక బోర్డులు, వెలుగుల ఏర్పాటు వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలల వద్ద ప్రత్యేక రహదారి భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ విబూకృష్ణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు, కడప ఆర్డీవో మురళీ, కేఎంసీ కమిషనరు భవానీప్రసాద్, జడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, విద్యుత్తు శాఖల ఎస్ఈలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు, రోడ్డు సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మల్లికార్జునుడు

APS RTC

టెండరు ప్రకటన

పల్లె వెలుగు

YSR కడప జిల్లా పరిధిలోని బస్ స్టేషన్ల నందు OPRS కౌంటర్లు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నిర్వహించుటకు అనుభవం/ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు/ కాంట్రాక్టర్లు/ సంస్థల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.02-09-2026 నుండి తేది.16-09-2026 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.17-09-2026న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, కడప నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. E2/797(03)/2026-DPTO/YSR, తేది:31-08-2026 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, కడప.

పత్రిక ప్రకటన

నూతన కలెక్టరు ఆఫీస్ కాంప్లెక్స్ నందు పొరుగు సేవల ఏజెన్సీ ద్వారా SECURITY పనులను చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

దరఖాస్తులు 01.09.2026వ తేదీ నుండి 08.09.2026 తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు కలెక్టరు కార్యాలయము (సి.బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.5000/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తును స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 08.09.2026వ తేది మధ్యాహ్నం 3.00 గంటల సమయం లోపు సమర్పించవలెను. 11.09.2026వ తేదీన సాయంత్రం 4.00 గంటలకు టెండర్లు తెరవబడును. అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

సం/- శ్రీమతి నిధి మీనా, I.A.S, జాయింట్ కలెక్టర్/చైర్మన్, డి.పి.సి., కడప.

పత్రిక ప్రకటన

వై.యస్.ఆర్. కడప జిల్లా, నూతన కలెక్టరు వారి కార్యాలయం నందు కంప్యూటర్స్ మరియు ప్రింటర్ కొనుగోలు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

కంప్యూటర్స్ మరియు ప్రింటర్స్ (configuration) వివరాలు 01.09.2026వ తేదీ నుండి 08.09.2026వ తేదీ మధ్యాహ్నం 03.00 గంటల వరకు పరిపాలన అధికారి, కలెక్టరు వారి కార్యాలయము (సి.బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.10,000/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తును స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 08.09.2026వ తేదీ మధ్యాహ్నం 03.00 గంటల సమయం లోపు సమర్పించవలెను 11.09.2026వ తేదీన సాయంత్రం 04.00 గంటలకు టెండర్లు తెరవబడును. అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

సం/- శ్రీమతి నిధి మీనా, I.A.S, జాయింట్ కలెక్టర్/చైర్మన్, డి.పి.సి., కడప.

EENADU Classifieds

EDUCATION

సులభంగా పాస్ అవకాశం 10th/ ఇంటర్ (APOSS/NIOS) B.A, B.COM, B.SC, B.B.A, BCA, M.A, M.COM, M.SC, MBA, MCA, B.TECH, DIPLOMA, ITI, గ్రేట్ ఇండియా అకాడమి ప్రొద్దుటూరు. ✆: 8639612692, 9542222400.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PERSONAL CLASSIFIEDS

LOST

ఒరిజనల్ సర్టిఫికెట్ పోయినది. బచ్చుమేఘన S/O B.సాయిరాం పేరున గల ఇంటర్మీడియట్ ఒరిజనల్ సర్టిఫికెట్ ముద్దనూరు పరిసర ప్రాంతంలో పోయినది. దొరికిన వారు వెంటనే తెలియజేయగలరు. సెల్: 6305775266.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 330/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రాజంపేట

•రాజంపేట •బద్వేలు

ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి

బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన సిబ్బందికి సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు ఒకే సమస్యపై పలు మార్లు ఫిర్యాదు చేస్తున్నారని, గ్రామ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లే జరుగుతుందన్నారు. సర్వేకి సంబంధించిన సమస్యలు ఎందుకు పెరుగుతున్నాయని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మండల అధికారులు కూడా ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.

ఆలయానికి కేటాయించిన భూమి పరిశీలన

రికార్డులను పరిశీలిస్తున్న జేసీ నిధిమీనా, చిత్రంలో అధికారులు

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాటూరు పంచాయతీ పరిధిలో కన్యాతీర్థంలో కొలువైన శివాలయ అభివృద్ధి పనుల కోసం కేటాయించిన స్థలాన్ని జేసీ నిధి మీనా, సబ్ కలెక్టర్ భావన సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భూమి కేటాయించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరగా 7.66 ఎకరాల భూమిని కేటాయించినట్లు చెప్పారు. ఇక్కడ కల్యాణ మండపంతో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజంపేట : 9441872651
బద్వేలు గ్రామీణ : 8008573493
గోపవరం : 8374076144
ఒంటిమిట్ట : 7036700101

?: రాజంపేట మండలం వెంకటరాజుపేటలో గత రెండు రోజులుగా తాగునీరు రావడం లేదు. బోరు మోటారుకు మరమ్మతులు చేయాలి. **- రమణ, వెంకట రాజుపేట**

?: పోలి గ్రామంలో తాగునీటి మోటారు కాలిపోవడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడింది.

✓: మండలంలోని కార్యదర్శులకు చెప్పి మోటారు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. **(పై రెండు సమస్యలకు రాజంపేట ఎంపీడీవో వరప్రసాద్ సమాధానమిచ్చారు.)**

?: రాజంపేటలోని సాతపల్లి వద్ద మురుగు రోడ్డుపై పారుతోంది. దీని వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- రామకృష్ణ, సాతపల్లి**

✓: పారిశుద్ధ్య కార్మికులచే పూడిక తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

?: పట్టణంలోని బోయపాలెం కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు తీసి రోడ్డుపై వేశారు. త్వరగా తరలించని కారణంగా దుర్వాసన వస్తోంది. **- కళ చంద్ర, బోయపాలెం**

✓: వెంటనే పూడిక మట్టిని తరలిస్తాం.

(పై రెండు సమస్యలకు రాజంపేట మున్సిపాలిటీ పారిశుద్ధ్యం విభాగం ఏఈ మల్లేశ్ సమాధానమిచ్చారు.)

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

స్పందించారు.. పరిష్కరించారు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం నూనెవారిపల్లి మార్గంలోని వినాయకనగర్‌లో కాలువలో మురుగు ముందుకు పారడం లేదు. దీంతో మురుగు పొంగిపొర్లి రోడ్డుపై పారడంతో స్థానిక ప్రజలు కొంతకాలంగా ఇబ్బందిపడుతూ వచ్చారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'ఇళ్ల ముంగిట కనపడదా మురుగు' అనే శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన పురపాలక శానిటరీ అధికారులు సిబ్బందిని పంపి చర్యలు చేపట్టారు. కాలువలో పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించారు.

● **గోపవరం, న్యూస్‌టుడే:** గోపవరం ఎస్టీ కాలనీకి నీరందించే బోరు పైపు పగిలి నీరు వృథాగా పోతోందని సోమవారం మేమున్నాం మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో హసీనా సిబ్బందిని పంపి పగిలిన పైపునకు మరమ్మతులు చేయించారు.

● బ్రాహ్మణపల్లెలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు పారడం లేదు. దీంత పరిసరాలు దుర్వాసన వస్తున్నాయని సోమవారం మేమున్నాం మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మోషే పారిశుధ్య కార్మికుల చేత కాలువల్లో వ్యర్థాలను శుభ్రం చేయించారు.

అతివలు.. ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) అండతో మహిళలు స్వయం ఉపాధి బాట ఎంచుకుంటున్నారు. తద్వారా పలు రకాల వ్యాపారాలు చేస్తూ కుటుంబ ప్రగతిలో తమవంతు పాత్ర పోషిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తక్కువ వడ్డీ, సులభ రుణ మంజూరు, స్త్రీనిధి, సీఐఎఫ్ ద్వారా రుణం పొంది వెసులుబాటుతో మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. తమకు ఆసక్తి ఉన్న రంగాలలో పనిచేస్తూ ఆదాయం పొందుతూ కుటుంబానికి ఆసరా నిలుస్తున్నారు. వ్యాపారాల్లో రాణిస్తున్న నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

దుస్తుల వ్యాపారంతో ముందుకు

పది సంవత్సరాలుగా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. బ్యాంకులు ఎలాంటి గ్యారెంటీ లేకున్నా సక్రమంగా పొదుపు రుణం చెల్లించే సంఘాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. సుండుపల్లిలో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నా. ప్రస్తుతం బ్యాంకు లింకేజీ ద్వారా రూ.5లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.3లక్షలు రుణం తీసుకున్నా. ప్రతి నెలా రూ.60వేల వరకు మిగులు ఉంటోంది. రుణాలు సక్రమంగా చెల్లిస్తూ వస్తున్నా. ఈ వ్యాపారం పిల్లల చదువులకు, కుటుంబ పోషణకు ఎంతో ఉపయుక్తంగా ఉంది.
- ఎస్.సల్మా, సుండుపల్లి

ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నా

ఎనిమిది సంవత్సరాలుగా ఎస్‌హెచ్‌జీ గ్రూపులో ఉన్నా. సుండుపల్లిలో ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నా. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.4 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.3 లక్షలు రుణం తీసుకున్నా. ప్రతినెలా పొదుపు, రుణ కంతులు చెల్లిస్తాను. ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తూ.. నెలకు రూ.50 వేల వరకు ఆదాయం పొందుతున్నాను. సంఘం ద్వారా అందుతున్న సహాయం తక్కువ వడ్డీతో ఎంతో ఉపయుక్తంగా ఉంది. స్వయం ఉపాధితో కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా ఉంటున్నాను.
- ఎస్.రిహనాబేగం, సుండుపల్లి

నీటి శుద్ధి కేంద్రాలతో ఉపాధి

11 సంవత్సరాలుగా సభ్యురాలిగా కొనసాగుతున్నా. ఇంటివద్దే నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నా. వాహనాలు పెట్టుకొని క్యాన్లద్వారా నీటిని సరఫరా చేస్తాం. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రూ.8లక్షల వంతున, సీఐఎఫ్ నిధుల నుంచి రూ.4లక్షలు రుణం తీసుకున్నాను. మా కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నాను. నెలకు రూ.2లక్షల వరకు ఆదాయం పొందుతున్నాం. మా కుటుంబ సభ్యులతో పాటు మరో కొందరికి ఉపాధి కల్పిస్తున్నాను.
- ఎస్.షాహీనా, సుండుపల్లి

చింతలపల్లెలో వెలిగొండ సంబరాలు

సంబరాలు చేసుకుంటున్న ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు రంతూ, తెదేపా నాయకులు

కలసపాడు, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు నుంచి జలాలను విడుదల చేస్తున్న నేపథ్యంలో మండలంలోని చింతలపల్లెలో సోమవారం ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు రంతూ ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వం చేసిన రెండేళ్ల సంక్షేమం అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం చేశారు. తొలుత కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల నుంచి వచ్చిన తెదేపా నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ. . వెలిగొండ ప్రాజెక్టు జలాల వల్ల ఈ ప్రాంతానికి తాగునీరు, సాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జి.వెంకటరామిరెడ్డి, కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, పట్టాభిరెడ్డి, రోషిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సర్ కార్యక్రమంపై రాజకీయ నేతలతో సమీక్ష

రాజంపేట గ్రామీణ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై సబ్ కలెక్టర్ భావన సోమవారం వివిధ రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలు నుంచి వచ్చిన నూతన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించామన్నారు. పార్టీ నాయకుల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆమె తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని కోరారు. తహసీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

24వ వార్డులో మహిళకు కరపత్రం అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి, తెదేపా నాయకులు

బద్వేలు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టం కట్టాలని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి సూర్యనారాయణరెడ్డి ప్రజలను కోరారు. స్థానిక 24వ వార్డులో పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన ఇంటింటి పర్యటన చేపట్టారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యకర్తలందరి సమష్టి కృషితో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు డిష్ ప్రతాప్, హరిప్రసాద్, రవి తేజ, కటారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2న అంతర్జాతీయ సమావేశం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 2న 'వన్ హెల్త్' అనే అంశంపై అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్ రాజ్ తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ వీరనాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో ఈ సమావేశం ఉంటుందన్నారు.

పోలింగ్ కేంద్రాల ప్రకటన

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో 130 వార్డులు ఉన్నాయి. అన్నింటికీ తుది పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రకటించినట్లు డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సోమవారం తెలిపారు. స్థానికుల నుంచి అందిన అర్జీలను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని కొన్నిచోట్ల స్వల్ప మార్పులు చేసినట్లు వివరించారు.

కడపకు విద్యుత్తు స్తంభాల తరలింపు

కడప స్టోర్స్‌కు తరలిస్తున్న పాత ఇనుప విద్యుత్తు స్తంభాలు

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడు మండలానికి సంబంధించిన పాత ఇనుప విద్యుత్తు స్తంభాలను సోమవారం పోరుమామిళ్ల విద్యుత్తు ఉపకేంద్రం నుంచి కడప స్టోర్స్‌కు తరలించారు. ఈ విషయమై ఆగస్టు 28న 'విద్యుత్తు శాఖలో ఇంటి దొంగలు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో రహస్యంగా దాచిన ఇనుప స్తంభాలను కొన్నింటిని కలసపాడు విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 29న 'ఇంటి దొంగలను కాపాడే ప్రయత్నాలు' అనే శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. 20 ఇనుప స్తంభాలను (1920 కిలోలు) ప్రత్యేక వాహనంలో భద్రంగా తరలించినట్లు పోరుమామిళ్ల డీఈ రవికుమార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. దీని వెనుక ఎవరున్నారన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.

గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు

రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: చెరువు, కొండప్రాంతం నుంచి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయకుమార్ హెచ్చరించారు. రంగసముద్రం ఎస్టీ కాలనీ సమీపంలో సోమవారం అక్రమంగా గ్రావెల్ మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

11 నుంచి పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 11 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించాలని తితిదే అధికారులు నిర్ణయించారు. రాములోరి సన్నిధిలో 11న సాయంత్రం అంకురార్పణ చేయనున్నారు. 12న పవిత్ర ప్రతిష్ఠ, 13న పవిత్ర సమర్పణ, 14న మహా పూర్ణాహుతి నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అనుమతిచ్చారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం హోమాలను నిర్వహిస్తారు. ఆలయంలో పరిపాలన పరంగా, పూజా కైంకర్యాల్లో తెలిసి, తెలియక జరిగిన తప్పిదాల దోష నివారణకు ప్రతి ఏటా పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి కూడా ఏర్పాట్లు చేయాలని ఆయా విభాగాల అధికారులకు సోమవారం ఉత్తర్వులందాయి.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

యంత్రంతో గుంత తీయిస్తున్న అధికారులు

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని మాచుపల్లె పరిధి ఉక్కాయపల్లె పెన్నా నదిలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు పెన్నాకు ట్రాక్టర్లు వెళ్లకుండా యంత్రంతో సోమవారం గుంత తీయించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

శంకుస్థాపన కార్యక్రమంలో స్థానికులు

అట్లూరు, రాజంపేట, న్యూస్‌టుడే: అట్లూరు మండలంలోని కుంభగిరిలో రామాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. భక్తి శ్రద్ధలతో వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ ఆలయ నిర్మాణానికి పూజలు చేపట్టారు. కార్యక్రమానికి బద్వేలు మార్కెట్ యార్డు ఛైర్మన్ నారిశెట్టి సుప్రజ, శివశంకర్ హాజరయ్యారు. రాజంపేట పట్టణం ఈడిగపాళెంలోని వరసిద్ధివినాయకస్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సిద్దవటం: సిద్దవటంకు చెందిన రమాదేవి (25) వివాహిత కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ.. ఆదివారం రాత్రి మృతి చెందారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన నారాయణతో రమాదేవికి కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. కొంతకాలం తర్వాత ఇరువురి మధ్య మనస్పర్థలు తలెత్తిన కారణంగా భర్త ఆమెతో తరచూ గొడవ పడేవారు. జీవితంపై విరక్తి చెందిన ఆమె గత నెల ఆగస్టు 19వ తేదీన ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కడప సర్వజన ఆసుపత్రికి తరలించి ఆమెకు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందారని ఎస్‌ఐ హారిక తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంగం, న్యూస్‌టుడే: స్నేహితురాలి వివాహానికి హాజరైన ఓ యువతి అదృశ్యమైన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై భోజ్యానాయక్ తెలిపిన వివరాల మేరకు.. బద్వేలు సమీపంలోని ఓ కాలనీ చెందిన యువతి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. సంగంలో ఆదివారం జరిగిన స్నేహితురాలి వివాహానికి తండ్రితో కలిసి హాజరయ్యారు. కల్యాణ మండపంలో కొంతసేపు ఉన్నారు. అనంతరం కనిపించకుండా పోయారు. తండ్రి కుమార్తెకు ఫోన్ చేయగా పనిచేయలేదు. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బెంగళూరులో ఆచూకీ లభ్యం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: గత నెల 19న అదృశ్యమైన యువతి(20) ఆచూకీ లభించినట్లు ఒంటిమిట్ట పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలానికి చెందిన ఓ యువతి గత నెల 19న అదృశ్యమైందని తల్లి ఫిర్యాదు మేరకు అదే రోజు కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు. అన్వేషణ చేపట్టగా యువతి బెంగళూరులో ఉన్నట్లు గుర్తించామన్నారు. యువతిని సోమవారం ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని వివరించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి గాయాలు

కాశినాయన: ద్విచక్రవాహనం అదుపు తప్పి సిద్దమూర్తి రాజారెడ్డి (45)అనే వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రంపాడు గ్రామానికి చెందిన సిద్దమూర్తి రాజారెడ్డి వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై నరసాపురానికి వెళ్లారు. పని ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా.. రంపాడు గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. క్షతగాత్రుణ్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ఏడేళ్ల పసిప్రాయం.. నడవలేక దైన్యం

బిడ్డతో తల్లి భాగ్యమ్మ

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలులోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కసువు గణేష్ పుట్టుకతోనే మానసిక, శారీరక దివ్యాంగుడు. సొంతంగా నిల్చోలేరు, తినలేరు. తల్లిదండ్రుల సహాయం లేనిదే ఏ పని చేయలేడు. తల్లిదండ్రులు కసువు సుబ్బరాయుడు, భాగ్యమ్మ. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. మెదటి బిడ్డ గణేష్(7). పుట్టుకతో మానసిక, శారీరక దివ్యాంగుడు కావడంతో ఎన్నో ఆసుపత్రులు తిప్పి రూ.లక్షలు ఖర్చు చేశారు. అయినా బిడ్డకు నయం కాలేదు. తండ్రి కూలీ పనికి పోతే తల్లి భాగ్యమ్మ గణేష్‌తో పాటు ముగ్గురు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటారు. తండ్రి సుబ్బరాయుడు తెచ్చిన కూలీ డబ్బులతోనే వారికి పూట గడుస్తోంది. గణేష్‌కు దివ్యాంగుల పింఛను అందడం లేదు. 98 శాతం వికలత్వం ఉందని డాక్టరు సదరన్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఎన్నో సార్లు దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నా.. వారికి సహాయం అందలేదు. అధికారులకు అర్జీలు ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మా బిడ్డ అన్నం తినలేడని, ప్రతిరోజు బెడ్డు, పాలు మాత్రమే తింటాడని, పింఛన్ అందించి ఆదుకోవాలంటూ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

బాలుడికి ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లికి చెందిన రెండేళ్ల బాలుడు పొరపాటున వేడి నీటిలో కూర్చోవడంతో 20 రోజుల కిందట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు చిన్నారిని ఎక్కడికీ పంపకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే చికిత్స అందించారు. ఇదే వైద్యం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఉంటే రూ.వేల రూపాయలు ఖర్చయ్యేవని వైద్యులు దిలీప్‌గుప్తా, పర్వానా తెలిపారు. ప్రస్తుతం పిల్లాడు ఆరోగ్యంగా ఉన్నాడని, ఈ రోజే ఇంటికి పంపామని చెప్పారు. సుండుపల్లిలో మెరుగైన సేవలందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ప్రతినెలా పదో తేదీన ఆసుపత్రిలో గర్భిణులకు స్త్రీవైద్య నిపుణులు సంయుక్త పరీక్షలు చేసి సలహాలిస్తారని వివరించారు.

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక

ఏబీవీపీ నగర నూతన కమిటీ సభ్యులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర వసతి గృహాల కన్వీనర్ అభిలాష్ అన్నారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం నూతన నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా దేవేంద్రనాథ్, నగర కార్యదర్శిగా కార్తీక్, దాంతో పాటు 30 మంది విద్యార్థులతో నగర కమిటీని ఏర్పాటు చేశామని అభిలాష్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, బాలరంగయ్య, పాండురంగారెడ్డి, చంద్ర, హర్ష, ముని, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

కడప లీగల్: నగరంలోని శివానందపురంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు, న్యాయవాది హరిబాబు సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధీ నగర్ ప్రజలకు, రైల్వే కార్మికులకు బీమా చట్టంపై అవగాహన కల్పించారు. అధికార సంస్థ ప్రతినిధులు ఎన్.నీలకంఠేశ్వర్‌రెడ్డి, పి.మనోహర్, ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

ఏజెంట్ మోసంపై ఎస్పీకి వినతి

కుటుంబ సభ్యులతో బాధితుడు ఓబయ్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కువైట్‌కు పంపిస్తానంటూ రూ.4.59 లక్షలు డబ్బులు తీసుకుని మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన ఓబయ్య సోమవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. జీవనోపాధి కోసమని కువైట్‌కు వెళ్లేందుకు బద్వేలుకు చెందిన ఏజెంట్ కేశవ్ వద్దకు వెళ్లగా అతను రూ.4.59 లక్షలు డబ్బులు తీసుకుని కువైట్‌కు పంపించారు. కువైట్‌లో సరైన ఉద్యోగం లేక తిరుగుతున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకుని తిరిగి ఇంటికి పంపించారన్నారు. ఏజెంట్ రూ.4.59 లక్షలు తీసుకుని తనను మోసం చేశారని బాధితుడు వాపోయారు. ఏజెంటు వద్దకు వెళ్లి ఎందుకిలా చేశావని ప్రశ్నించగా.. తనను అసభ్య పదజాలంతో దూషించారన్నారు. పోలీసు అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

విధులకు హాజరు కాలేదని ఫిర్యాదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని చింతరాజుపల్లె స్వర్ణ గ్రామం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ అభివృద్ధి అధికారి (కార్యదర్శి) చైతన్య విధులకు హాజరు కాలేదని ఎంపీడీవో జె.సుజాతమ్మకు జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెలవులో వెళ్తున్నట్లు ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఫిర్యాదు మేరకు ఈ విషయాన్ని డీపీవో దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీడీవో తెలిపారు.

పరిశ్రమల అనుమతుల్లో ఆలస్యం తగదు

కడప ఏడురోడ్లు: జిల్లా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతుల్లో ఆలస్యం కాకుండా చూడాలని డీఆర్వో మల్లికార్జునుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది.

కేంద్రాలు 68.. పర్యవేక్షకురాలు ఒక్కరు

అస్త వ్యస్తంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

అరకొర పిల్లలతో కొనసాగుతున్న అంగన్‌వాడీ-3 కేంద్రం

వీరబల్లి, న్యూస్‌టుడే: వీరబల్లి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణ సరిగా లేక పిల్లల హాజరు కూడా తగ్గిపోయింది. మండలంలో ముగ్గురు సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఒక్కరే కొనసాగుతున్నారు. కొన్ని కేంద్రాలల్లో పిల్లలు రాకపోవడంతో సహాయకురాలు, ఆయాలు కాలక్షేపం చేసి వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. హాజరు తక్కువగా ఉన్నా. . హాజరు మాత్రం అధికంగా వేసుకుంటున్నారన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షణా లోపం కారణంగా ఈ పరిస్థితి నెలకొంది.

● **ఇలా ఉంది పరిస్థితి :** మండలంలో 68 కేంద్రాలను మూడు క్లస్టర్లుగా విభజించారు. మండలంలోని అంగన్‌వాడీల పరిధిలో 1,723 మంది పిల్లలు, గర్భిణులు 379 వరకు ఉన్నారు. ముగ్గురు సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే కొనసాగుతున్నారు. ఒక్కరే కావడంతో బాల్యవివాహాల కట్టడి, పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు, సమావేశాలకు వెళ్లాల్సి ఉండడంతో కేంద్రాల పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదన్న వాదనలు అధికంగా ఉన్నాయి.

● **అరకొరగా హాజరు :** వీరబల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం విచారించగా అంగన్‌వాడీ-1 కేంద్రంలో పిల్లలు లేకున్నా ఆయా, హెల్పర్ ఉండడం విశేషం. వారి మధ్య విభేదాల కారణంగా తనకు పిల్లల జాబితా ఇవ్వలేదని ఆయా చెప్పడం, కేంద్రానికి ఆయా పిల్లల్ని తీసుకురావడం లేదని హెల్పర్ చెప్పారు. ఆలస్యంగా ఆయా ఒకరిని తీసుకొచ్చారు. అంగన్‌వాడీ - 3 కేంద్రంలో ఇద్దరు పిల్లలతో ఆయా, హెల్పర్‌లు ఉన్నారు. వివరణ అడగగా.. జ్వరాలు ఉండడం వల్ల పిల్లలు కేంద్రాలకు రాలేదని వారు పేర్కొన్నారు. ఈ ఉదాహరణతో మండలంలోని కేంద్రాల పరిస్థితి ఎలా ఉంటుందో దీన్ని బట్టి అర్థమవుతుంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మండలంలో 68 కేంద్రాలకు ఒక్కరినే ఉండడంతో అన్ని కేంద్రాలను చూడాలంటే ఇబ్బందికరంగా ఉంది. అయినప్పటికీ కేంద్రాలను పరిశీలిస్తూనే ఉన్నాను. కేంద్రాలను పిల్లలు లేకుండా కొనసాగిస్తే.. చర్యలు తీసుకుంటాం. అంగన్‌వాడీ- 1, 3 కేంద్రాలపై ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. వాటి పట్ల చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తా. **- తులసమ్మ, పర్యవేక్షకురాలు, వీరబల్లి**

LIC 70వ LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
◌ ప్రతి ఒక్కరికీ ఒక పాలసీ, ప్రతి ఇంటికీ ఒక పాలసీ.
◌ జీవిత బీమా చేయండి - ధీమాగా ఉండండి.
10వ తరగతి లేదా ఇంటర్ చదివి ఖాళీగా ఉన్న 18 సం॥లు నిండిన వారికి LIC ఏజెన్సీ ఇవ్వబడును.

బి.వసంతరాజు
చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్
తాళ్ళపాక, రాజంపేట.
Cell: 9848162598

LIC 70వ LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
70వ LIC వ్యవస్థాపక దినోత్సవం శుభసందర్భంగా పాలసీదారులకు, ఏజెంట్లకు, LIC అధికారులకు, సిబ్బందికి మరియు ప్రతి ఒక్కరికీ నా హార్దిక శుభాకాంక్షలు.
◆ జీవిత బీమా చేయండి - ధీమాగా ఉండండి

జలతోటి ప్రసాద్‌బాబు
డెవలప్‌మెంట్ ఆఫీసర్
LIC ఆఫ్ ఇండియా, రాజంపేట.
CELL : 9550118158

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పాలన

మాట్లాడుతున్న ముక్తియార్

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ముక్తియార్ అన్నారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. వైకాపా నాయకులు రాష్ట్రాభివృద్ధి చూసి ఓర్వలేక అనవసర విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతి అభివృద్ధి పని తామే చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైకాపా పాది కూల్చే నేపథ్యం తప్ప అభివృద్ధి చేసే ఆలోచనే లేదన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి దిశగా తీసుకెళుతున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. నాయకులు జిలాన్‌బాషా, లాల్ బాషా, రాయల్ గౌస్ పాల్గొన్నారు.

ఇటు ఆటో వెళ్లాలన్నా కష్టమే

ప్రొద్దుటూరు పట్టణం పాతమార్కెట్‌వీధిలో పలువురు రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నారు. ఇక్కడ అనేక వ్యాపార సముదాయాలు ఉన్నాయి. జన సంచారం అధికంగా ఉంటుంది. వీటితో పాటు ఇరుకైన వీధులతో పాదచారులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అత్యవసర సమయాల్లో నాలుగు చక్రాల వాహనాలు రావాలంటే గగనంగా మారుతోంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

?: ప్రొద్దుటూరు నుంచి వెల్లాల ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే భక్తులు సంఖ్య అధికంగా ఉంది. మరి కొన్ని బస్సులు ఏర్పాటు చేయాలి. **- గోవింద శ్రీనివాసులు, స్థానికుడు**

✓: ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- కె.వి.గంగాధర్, ఆర్టీసీ డీఎం, ప్రొద్దుటూరు**

?: పట్టణంలోని వసంతపేటవీధిలో ఈశ్వర్ రెడ్డినగర్‌కు వెళ్లే వీధికి ముందు కాలువ అధ్వానంగా ఉంది. **- ఈశ్వర్, స్థానికుడు**

✓: పూడికతీతకు చర్యలు తీసుకుంటాం. **- చింతాసురేష్, సచివాలయవార్డు పారిశుద్ధ్య కార్యదర్శి**

?: నడింపల్లె వీధిలో మసీదు ముందు వైపు ఉన్న మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. **- లక్ష్మిదేవి, స్థానికులు**

✓: త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తాం. **- సుబ్బరాయుడు, సచివాలయవార్డు పారిశుద్ధ్య కార్యదర్శి**

?: జిన్నారోడ్డులోని యూనియన్ బ్యాంకు ముందు వైపు ఉన్న కాలువ, ఆకుల వీధిలో ఉన్న మురుగు కాలువలు వ్యర్థాలు పేరుకుపోయాయి. **- వెంకటేష్, లక్ష్మయ్య, స్థానికులు**

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. **- రాజేంద్రప్రసాద్, సిద్దయ్య, వార్డు పారిశుద్ధ్య కార్యదర్శులు**

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

స్పందించారు.. పరిష్కరించారు

మైదుకూరు పట్టణంలో పోరుమామిళ్ల రోడ్డు నుంచి శాంతినగర్ మీదుగా జోసెఫ్‌పేటకు కేసీకాలువ కట్టను కప్పేసిన కంపచెట్లను తొలగించే పనులు అధికారులు చేపట్టారు. 'అధికారుల నిర్లక్ష్యం.. అభివృద్ధికి దూరం' శీర్షికన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన పుర అధికారులు చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

ప్రదక్షిణలు చేస్తున్నా.. పట్టించుకోరేం!

జమ్మలమడుగు గ్రామీణ, చాపాడు, పెద్దముడియం, మైలవరం, ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్న చిన్న సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. ఏళ్లుగా మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అక్కడ కనీసం ఆలకించే నాథుడే కరవయ్యారని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, చాపాడు, మైలవరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి అధిక సంఖ్యలో వచ్చి దరఖాస్తులు అందజేశారు. మా బాధలు ఆలకించి.. పరిష్కారం చూపాలని వేడుకున్నారు.

ప్రజల సమస్యలు వింటున్న ఆర్డీవో శిరీష

1బీ అడంగల్ కోసం తిరుగుతున్నా

నాకు రెండు ఎకరాలు భూమి ఉంది. అవసరం నిమిత్తం మూడ నెలల కిందట ఎకరా విక్రయించాను. 1బీ అడంగల్ వస్తే రిజిస్ట్రేషన్ చేయిద్దామని తిరుగుతున్నా. చుక్కల భూముల మార్పులపై ప్రభుత్వ నిర్ణయం రావాల్సి ఉందని చెబుతున్నారు. ఇంకెంత కాలం ఆగాలో అర్థం కావడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- ఎస్ఆర్.కృష్ణారెడ్డి, చియ్యపాడు, చాపాడు మండలం**

ఆన్‌లైన్‌లో సవరించడం లేదు

ముద్దనూరు మండలం కొర్రపాడులో సర్వే సంఖ్య 391-3-పీ4లో ఉన్న 20 సెంట్ల భూమిలో 10 సెంట్ల భూమిని 2022లో ఓ వ్యక్తికి విక్రయించాను. 2025లో ఆ వ్యక్తికి 20 సెంట్లు అమ్మినట్లు ఆన్‌లైన్‌లో నమోదయ్యింది. పత్రాలు అన్నీ సమర్పించాను. ఆన్‌లైన్‌లో సవరించి మా భూమిని అప్పగించాలని తిరుగుతూనే ఉన్నా. **- శ్రీనివాసులు**

పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు

ఎంపీడీవో అందుబాటులో ఉండటం లేదు

ప్రొద్దుటూరు మండల డిప్యూటీ ఎంపీడీవో రామంజనేయరెడ్డి సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. వివిధ అవసరాలు, పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు, ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశాం. **- వెంకటసుబ్బారెడ్డి, భగత్‌సింగ్ కాలనీ, ప్రొద్దుటూరు మండలం**

స్థలాన్ని ఆక్రమించుకుని బెదిరిస్తున్నారు

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని అమృత నగర్‌లో రెండు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. నా భర్తకు అనారోగ్య కారణంతో నేను పట్టించుకోలేదు. ఇప్పుడు అక్కడికెళ్లి చూస్తే నాకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకొని వేరే వారు నిర్మాణం చేపట్టారు. అయిదేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. **- దాసరిబీబీ**

అధికారులు చర్యలు తీసుకోవాలి

పెద్దముడియం మండలం దిగువకల్వటాలలో సర్వే సంఖ్య 24లో మాకు 3.10 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి సంబంధించి ఆన్‌లైన్‌లో మా నాన్న పేరు కూడా నమోదు అయ్యింది. డబుల్ ఎంట్రీ తొలగించాలని తిరుగుతున్నా. చర్యలు తీసుకోవాలి. **- అచ్చిరెడ్డి**

రాష్ట్ర స్థాయి లంచగొండి రాచమల్లు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి.. చిత్రంలో నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైకాపా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన లంచగొండి అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి విమర్శించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రొద్దుటూరులో కార్పొరేట్ సంస్థలు వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు రాచమల్లు లంచం తీసుకోలేదని బుకాయిస్తున్నారని.. తీసుకోకుంటే అప్పుడే వాటిని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. వాస్తవాలు ఎత్తి చూపుతున్న బీసీ నాయకులను చులకనగా మాట్లాడుతున్నారని అన్నారు. తెదేపా నాయకులు, కార్యర్తలపై చేయి పడితే ప్రొద్దుటూరులో ఉండలేవని హెచ్చరించారు. రాచమల్లు చెప్పే మాటలు అబద్ధాలని ప్రజలు ఎప్పుడో గ్రహించారన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, పట్టణాధ్యక్షుడు రాజగోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలంటే మాజీ ఎమ్మెల్యేకు చులకన

మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి బీసీలంటే చులకనభావం ఉందని తెదేపా నేత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సొంత పార్టీలోని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. వ్యక్తిగత దూషణలు మాని ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు.

డిమాండ్లు నెరవేర్చాలని నిరసన

నిరసన తెలుపుతున్న ఒప్పంద నర్సులు, ఉద్యోగులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్యశాఖలో ఏళ్ల తరబడి ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న పారామెడికల్ సిబ్బంది న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఒప్పంద వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వారు సోమవారం స్థానిక ప్రాంతీయ వైద్యశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అర్హులైన ఒప్పంద ఉద్యోగులందరినీ ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణమే క్రమబద్ధీకరించాలని.. అప్పటి వరకు వందశాతం గ్రాస్ జీతం చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సువర్ణ, లక్ష్మి, ప్రత్యూష, శాంతా, సుగుణ, సునీత పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు కోరుతూ ధర్నా

మైదుకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్న పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాలనీవాసులతో కలిసి సీపీఎం నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు రాజసింహ నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో పేదలు పదేళ్లుగా నివాసం ఉంటున్నా.. అక్కడ మౌలిక సౌకర్యాలు నోచుకోలేదన్నారు. రోడ్లు, విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. వెంటనే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వెలగని దీపం.. స్థానికులకు కష్టం



కొండాపురం మండలం కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని తిమ్మాపురం సర్కిల్ వద్ద విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. ప్రధాన కూడలిలో రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటోంది. దీంతో రోడ్డు దాటాలంటే ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూడలి నుంచి ఓవైపు కడప, మరోవైపు తాడిపత్రి, ఇంకో వైపు పులివెందులకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రివేళల్లో చీకటి ఉండటంతో తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొండాపురం**

పూడిక తొలగదు.. దుర్వాసన వీడదు

రాజుపాళెంలో ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న మురుగు కాలువ అధ్వానంగా ఉంది. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సక్రమంగా పూడిక తీయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాజుపాళెం**

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజుపాళెం, న్యూస్‌టుడే: రాజుపాళెంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అలీఖాన్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముద్దనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో గత పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు.. అలాగే శ్రీ వివేకవర్ధని జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం గజ్జల చెన్నారెడ్డి, భార్య అచ్చమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన రవిచరణ్, వెంకట కిరణ్, అభిషేక్‌రెడ్డిలకు వరసగా.. రూ.18 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు అందించారు. అలాగే కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ. 6వేల చొప్పున ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ఆందోళన

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘ పరిధిలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నాణ్యమైన పని ముట్లు తెప్పించాలని.. ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు చేయాలని, డీఏ, ఇంక్రిమెంట్లు సరెండర్ లీవ్ మంజూరు తదితర డిమాండ్లు నేరవేర్చాలని ఆందోళన చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్ఈడీ బల్బులు తొలగించాలని వినతి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా పలువురు వాహనదారులు ఎల్ఈడీ బల్బులు వినియోగిస్తున్నారని.. వాటితో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని బీసీ ప్రజాచైతన్యసమాఖ్య అధ్యక్షుడు బొర్రారామాంజనేయులు అన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సోమవారం ఏఎస్పీ విబూకృష్ణ, ఆర్టీవో నారాయణ నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. వాహనాలకు నిర్దేశించిన బల్బులనే వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి దేవేంద్రుడు, కోశాధికారి సంటయ్య, ఉపాధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

స్థానికులతో మాట్లాడుతున్న ఏఎస్పీ విబూకృష్ణ.. చిత్రంలో సీఐలు, ఎస్సైలు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ వదిలే ప్రసక్తి లేదని ఏఎస్పీ విబూకృష్ణ హెచ్చరించారు. మండల పరిధిలోని ఉప్పాగు యానాది కాలనీలో సోమవారం ఆయన నాకాబందీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 38 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ లక్ష్యమన్నారు. గంజాయి విక్రయాలు, వినియోగం సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐలు నాగభూషణ్, కొండారెడ్డి, వంశీనాథ్, రామాంజనేయుడు, ఎస్సైలు పాల్గొన్నారు.

కంకర పరిచి.. ఇక్కట్లు తెచ్చి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక శివారుల్లో ఉన్న పెన్నానగర్‌లో రోడ్డు నిర్మాణానికి.. సుమారు రెండు నెలల కిందట చిన్నపాటి కంకర పరిచారు. అనంతరం నిర్మాణ పనులు మాత్రం ఆలస్యం చేస్తున్నారు. ఫలితంగా కాలనీలోని చిన్నారులు, మహిళలు, వృద్ధులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మసీదుకు ఎదురుగా ఉన్న మరో వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై సోములవారిపల్లె పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ద్వాక్రా నిధుల్లో చేతివాటం!

చాపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన చాపాడులో యానిమేటర్ లేని స్థానిక స్వయం సహాయక సంఘాలకు ఓ సీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ మొబైల్ బుక్ కీపింగ్(రుణ అర్హత పొందిన సంఘాలను నమోదు చేయడం) చేసి.. సొమ్ము స్వాహా చేసుకుంటున్నారని పలు సంఘాల సభ్యులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అందుకు తన సంతకం ద్వారా రూ.వేలల్లో డ్రా చేశాడని గ్రామసమాఖ్య అధ్యక్షురాలు ఆరోపించారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని చెప్పారు. అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ విషయమై ఏపీఎం శ్రీధర్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

ప్రొద్దుటూరు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కొండారెడ్డి

జమ్మలమడుగు గ్రామీణ, ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యమని, నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ నరేష్‌బాబు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆంజనేయపురంలో శాంతిభద్రతలు, సైబర్ నేరాలు తదితర వాటిపై గ్రామసభ నిర్వహించారు. ● ప్రొద్దుటూరులోని ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో థాణా సీఐ కొండారెడ్డి విద్యార్థులకు మహిళలు, బాలలపై నేరాల నివారణకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎస్సై సత్యనారాయణ, ప్రిన్సిపల్ చంద్ర ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూడిక తొలగించకపోవడంపై ఫిర్యాదు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కొత్తపల్లె పంచాయతీలోని డీసీఎస్ఆర్ కాలనీలో ప్రధాన కాలువలో వ్యర్థాలు, పూడిక తొలగించకపోవడంతో రోడ్లపై మురుగు చేరుతోందని ఎంపీజే నాయకులు తెలిపారు. ఎంపీపీ పాఠశాల సమీపంలో దుర్వాసన, దోమలతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సోమవారం ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు.

కేసీ కాలువ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి

ప్రొద్దుటూరు గ్రామీణ: కేసీ కాలువ ఆయకట్టు పరిధిలోని భూములకు సాగునీరు ఇవ్వాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. ఎల్‌నినో సాకుతో శ్రీశైలం జలాశయం నుంచి పంటపొలాలకు నీరు విడుదల చేయకపోవడం తగదన్నారు. సాగునీరు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజుకు వినతి పత్రం అందజేశారు.

ప్రొద్దుటూరులో కుక్కల బెడద

ప్రొద్దుటూరు పట్టణం: పట్టణంలోని వీధికుక్కల బెడద అధికంగా ఉందని. . రాత్రివేళ ద్విచక్రవాహనదారులపై దాడులు చేస్తున్నాయని కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ పట్టణ ప్రజలు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో చరవాణి ద్వారా స్థానికులు సమస్యను కమిషనర్‌కు తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఏడుగురిపై కేసు

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో ఇరువర్గాల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఏఎస్సై హాజీబాషా వివరాల మేరకు.. తిమ్మాపురం సచివాలయంలో సర్ నోటీసుల విషయమై ఎద్దు.నాగశేఖర్‌కు.. అదే గ్రామానికి చెందిన సత్యలింగారెడ్డి మధ్య వాగ్వివాదం, ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అధ్యాపకుడిగా స్వర్ణ గ్రామ కార్యాలయ ఉద్యోగి

సుమోయోన్

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు స్వర్ణ గ్రామ కార్యాలయంలో కార్యదర్శి-3గా పని చేస్తున్న సుమోయోన్ రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా అర్హత సాధించారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన్ను నియమించినట్లు ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 2025 జూలైలో నిర్వహించిన రాతపరీక్షల్లో ప్రతిభ చాటి విజేతగా నిలిచారు. ఇటీవల అనుబంధ కంప్యూటర్ పరీక్షలో కూడా సత్తా చాటారు. సుమోయోన్ స్వస్థలం మైదుకూరు మండలంలోని మిట్టమానుపల్లె. పులివెందుల లయోల కళాశాలలో డిగ్రీ, రాయలసీమ విశ్వవిద్యాలయం (కర్నూలు)లో పీజీ పూర్తి చేశారు. 2014లో నల్లబల్లె (ముద్దనూరు) పంచాయతీ కార్యదర్శి-4గా ఉద్యోగంలో చేరారు. తర్వాత ఉద్యోగోన్నతిపై గొరిగెనూరుకు వచ్చారు.

మహాసభల జయప్రదానికి వినతి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభల ప్రచారంలో భాగంగా సోమవారం జమ్మలమడుగు పట్టణంలో డీవైఎఫ్ఐ నాయకులు ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఖాళీ పోస్టుల భర్తీ, నిరుద్యోగ భృతి అమలు, స్థానిక పరిశ్రమల్లో యువతకు, భూ నిర్వాసితులకు ఉద్యోగాల కల్పించాలని నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు అరుణ్, సుబహాన్, యాసిన్, తేజ పాల్గొన్నారు.

రైతులకు నష్టం చేస్తే ఊరుకోం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: భూములు కోల్పోతున్న అమాయక రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించకుండా పవర్ గ్రిడ్ పనులు చేపడితే ఊరుకోమని వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో పవర్ గ్రిడ్ విద్యుత్తు లైన్లు, టవర్ల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి అధికారుల తీరుపై మండిపడ్డారు. 2019లోనే నిబంధనలకు విరుద్ధంగా రైతులకు తక్కువ పరిహారం ఇచ్చి మోసం చేశారని, ఇప్పుడు అదే రీతిలో వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువకు అనుగుణంగా నష్ట పరిహారం అందించాలన్నారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అమృతానగర్ రోడ్డుకు మరమ్మతులెప్పుడో!

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని అమృతానగర్-1లో నీటి సరఫరా కోసం ఏడాది కిందట సీసీ రోడ్డును తవ్వి పైపు ఏర్పాటు చేశారు. కానీ, తవ్విన గుంతపై కాంక్రీట్ ఏర్పాటు చేయలేదు. ఇసుకతో చదును చేసి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుంతల్లో ఆటోలు, మోటారు బైకులు ఇరుక్కుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ**

భద్రం.. బడుల్లో బాలల ఆరోగ్యం

సిక్ రూమ్‌ల ఏర్పాటుకు చేరిన సామగ్రి

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. బడుల్లో ఎవరైనా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే తల్లిదండ్రులు బాధపడాల్సిన అవసరం లేని విధంగా చర్యలు తీసుకుంటోంది. పాఠశాలల్లో చికిత్స అందించేలా ప్రత్యేకంగా సిక్ రూమ్‌లను ఏర్పాటు చేస్తోంది. వీటికి అవసరమైన సామగ్రి బడులకు చేరింది. పీఎంశ్రీ పాఠశాలల్లో ముందుగా వీటిని ప్రారంభిస్తున్నారు.

ఒక్కో బడికి రూ.5లక్షలు

నియోజకవర్గంలోని ఏడు పీఎంశ్రీ పాఠశాలలకు వైద్య సదుపాయాల కల్పన, ఔషధాల నిమిత్తం ఒక్కో బడికి రూ. 5లక్షలు కేటాయించారు. ప్రధానోపాధ్యాయులు ఎంపిక చేసిన గదిని థర్డ్ పార్టీ ఏజెన్సీ సిక్ రూమ్‌గా మారుస్తుంది. అనారోగ్యం బారినపడిన వారిని ఆ గదిలో ఉంచి తక్షణం ఉపశమనం కలిగేలా శ్రద్ధ తీసుకుంటారు. ఇందుకు సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వారు ఆరోగ్య కార్యకర్తతో కలిసి చికిత్స అందిస్తారు. ఈ విధానంతో ఎంతో ప్రయోజనం ఉంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

● మైదుకూరులో రెండు, ఖాజీపేటలో రెండు, చాపాడు, బీమఠం, దువ్వూరులో ఒక్కో పాఠశాలకు ఏడాదికి సరిపడ మందులు, బీపీ, బరువు చూసే పరికరాలతో పాటు బ్యాండేజీ వంటి 31 రకాల సామగ్రి చేరింది. ఆ బడుల్లో పరుపుతో కూడిన మంచాలు, వాష్ బేసిన్, శానిటైజర్, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈవోలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చేరిన సామగ్రి

పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు విన్నపం

చాపాడు: పెద్దగురువలూరు పంచాయతీ శ్రీరాముల పేటలో నూతనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేయాలని ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు రమేష్ కోరారు. ఈ మేరకు జమ్మలమడుగు డీడీవో కార్యాలయంలోని ఏవోకు సోమవారం అర్జీ అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు విశేష సేవలు అందిస్తూ గత 70 సం॥లుగా 'మీ భవిష్యత్తు మా బాధ్యత' అనే నినాదంతో ముందుకుపోతున్న LIC OF INDIA నా పాలసీదారులందరికీ నా హృదయపూర్వక 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
బి.వెంకటమస్తాన్
డెవలప్‌మెంట్ ఆఫీసర్ (S.B.A),
LIC ఆఫీస్, ప్రొద్దుటూరు.

LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
◆ జీవిత బీమా చేయండి - ధీమాగా ఉండండి.
◆ జీవిత బీమా పాలసీ మీ కుటుంబానికి ఆసరా.
LIC వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పాలసీదారులకు, ఏజెంట్ మిత్రులకు, అధికారులకు మా శుభాకాంక్షలు.
జంపాల కృష్ణారెడ్డి, LIC Agent,
CM క్లబ్ అడ్వయిజర్,
President : South Central Zone
LIAFI (A.P., T.G., K.S)

(c) eenadu

ఎల్‌నినో ప్రభావం... ప్రత్యుత్పత్తిలో జాగ్రత్తలు అవసరం

ప్రొద్దుటూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: వాతావరణంలో తీవ్రమైన వేడి, అధిక తేమ శాతం వల్ల, మగ పశువుల ప్రత్యుత్పత్తి అవయవాలపై ప్రభావం చూపిస్తాయి. ఎద లక్షణాలు, ఎదలో ఉండే సమయం, అండాశయంలో అండాల సంఖ్య, పరిమాణం తగ్గిపోవడంతో అండం విడుదల శాతం తగ్గిపోతుంది. ఈస్ట్రోజన్ వంటి జీవరసాయనాలు తగ్గిపోతాయి. దీని వల్ల బీజకణాల కదలిక మందగించడం, ఫలదీకరణ, కట్టు శాతం తగ్గిపోతుంది. దీంతో గర్భధారణ శాతం 40-60 శాతం నుంచి 10-20 శాతం వరకు తగ్గుముఖం పడుతుంది. అధిక వేడి వల్ల కణ విభజన జరిగి పశువుల్లో పిండ మరణాలు సంభవిస్తాయి. ● ఆంబోతుల మీద కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రత కంటే వృషణాలు 2-6 డిగ్రీల సెంటిగ్రేడ్ తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే నాణ్యత కలిగిన వీర్యకణాలు తయారవుతాయి. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ [illegible] తెలియజేస్తున్నారు. ● జన్యు పరంగా ఉష్ణోగ్రతను సమర్థంగా తట్టుకోగలిగే ఒంగోలు వీర్యాన్ని ఉపయోగించే పలు యాజమాన్య పద్ధతులను పాటించి పశువుల్లో అధిక వేడిని తగ్గిస్తే పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. ● తగినంత పచ్చిమేత, నీరు సమకూర్చాలి. ● ఎద లక్షణాలు తరుచూ గమనించాలి. ఖనిజ లవణ మిశ్రమాన్ని ప్రతి రోజూ 30-50 గ్రాములు ఇవ్వాలి. ● పాకను శుభ్రంగా ఉంచి ఫ్యాన్లు లేదా స్ప్రింక్లర్లు వంటివి వినియోగించాలి. ● పశువులను చల్లటినీటితో శుభ్రపరచాలి. ● శరీర ఉష్ణోగ్రతను అదుపులోకి తీసుకువస్తే గర్భధారణ జరిగి పిండం ఏర్పడి కణవిభజన సక్రమంగా జరుగుతుంది. జీవరసాయనాలు కూడా సక్రమంగా విడుదల అవుతాయి. ● ఇలా చేస్తే ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా పశువుల పునరుత్పత్తి సామర్థ్యాన్ని పరిరక్షించుకోవచ్చు.

చిట్కా

వరిలో జింక్ లోపం ఇలా అధిగమిద్దాం

రైతేరాజు

కమలాపురం, ఒంటిమిట్ట, పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం వరి పంటను కొన్నిచోట్ల సాగు చేశారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు చల్లుతున్నారు. ఇలా చేయడం వల్ల పోషకాల సమతుల్యత లోపిస్తుంది. జింకు తక్కువగా ఉండటంతో పంట ఎదుగుదల, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను గుర్తించి సరిచేస్తే అధిక లాభాలు పొందవచ్చని కమలాపురం మండల వ్యవసాయ అధికారిణి సరస్వతి, ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ.సాయిమహేశ్వరి సూచించారు. ● వరిలో జింకు లోపం వచ్చినప్పుడు నాటిన 2-6 వారాల మధ్య పై నుంచి 3, 4వ ఆకుల్లో మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. పత్రం చివరల్లో, మధ్య ఈనెకు ఇరుప్రక్కల ఇటుక రంగు లేదా తుప్పు వర్ణం మచ్చలు కన్పిస్తాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా తయారై పట్టుకుంటే విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి సరిగ్గా దుబ్బు కట్టవు. పిలకలు తక్కువగా వస్తాయి. ఎంత నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చబడదు. ఇది చల్లని వాతావరణం ఉన్నప్పుడు బాగా కన్పిస్తుంది. జిల్లాలో ఉన్న నేలలు ఎక్కువగా క్షార స్వభావం కలిగి ఉన్నాయి. ఇక్కడ భూమి పీహెచ్ 7.5 నుంచి 8.5 వరకు ఉంటుంది. అటువంటి అధిక పీహెచ్ ఉన్న భూముల్లో వేసిన జింకు నేలలోనే గట్టిపడి మొక్కలకు అందదు. భాస్వరం అధికంగా ఉంటే అది జింకు లభ్యతను తగ్గిస్తుంది. ఒకే వరి పంట పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు కార్లు పండించేట్లయితే ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేటు వేయాలి. పైరులో లోప లక్షణాలు కనిపించగానే లీటరు నీటికి 3 గ్రాముల జింకు సల్ఫేటు, 5 గ్రాముల యూరియా కలిపి 5 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి. క్షార నేలలకు లీటరు నీటికి 12 గ్రాముల [illegible] 0.5 గ్రాముల నుంచి 1 గ్రాము [illegible] 20-25 రోజుల దశలో రెండుసార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. జింకు సల్ఫేటును భాస్వరం ఎరువులతో కలిపి వేయరాదు. కనీసం మూడు రోజుల వ్యవధిలో ఉండాలి. అలాగే జింకు ద్రావణంలో పురుగు మందులు లేదా తెగుళ్ల మందులను కలిపి వాడరాదని సూచించారు.

జీవిత బీమా.. ఆర్థిక ధీమా!

● అందుబాటులో 35 రకాల పాలసీలు

● నేటి నుంచి ఎల్‌ఐసీ వారోత్సవాలు

కడప ఏడురోడ్లు, విద్య, న్యూస్‌టుడే : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) ఏడు దశాబ్దాలుగా ప్రజల అభిమానాన్ని పొందుతోంది. 1956లో ముంబయి కేంద్రంగా ప్రారంభమైన ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ.. ఎప్పటికప్పుడు ప్రజలకు ఉపయోగపడే కొత్త పాలసీలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రజల నమ్మకమే భరోసాగా నిలుస్తోంది. కడప కేంద్రంగా 1980లో ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ డివిజనల్ కార్యాలయం పరిధిలోకి ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు వస్తాయి. మొత్తం మీద కడప డివిజనల్ పరిధిలో 20 బ్రాంచ్ కార్యాలయాలు, 14 శాటిలైట్ ఆఫీసులు పనిచేస్తున్నాయి. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోకి వస్తే మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, రైల్వేకోడూరు, రాయచోటి కేంద్రాల్లో శాటిలైట్ ఆఫీసులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

కడప ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం

కడప డివిజనల్‌లో 25 లక్షలకు పైగా

కడప డివిజనల్ పరిధిలో 25 లక్షలకు పైగా జీవిత బీమా పాలసీదారులు ఉన్నారు. అలాగే 14 వేలకు పైగా ఏజెంట్లు పనిచేస్తున్నారు. పుట్టిన బిడ్డ నుంచి 100 సంవత్సరాల వృద్ధుల వరకు అన్ని వయసుల వారికి సరిపోయే విభిన్న పాలసీలు కలిగి ఉండటం ఎల్‌సీఐ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఎటువంటి కాగితాలు, భౌతిక సంతకాలు లేకుండా పూర్తిగా ఆన్‌లైన్‌లో పేపర్ రహిత విధానంలో పాలసీలను తీసుకునే వెసులుబాటును యాప్ ద్వారా ఏజెంట్లకు కల్పించారు.

మై ఎల్‌ఐసీ యాప్ ద్వారా సేవలు

పాలసీదారుల కోసం 'మై ఎల్‌ఐసీ' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఖాతాదారులు వివిధ రకాల సదుపాయాలు, సేవలు పొందొచ్చు. పాలసీ బాండ్ లేకుండానే లక్ష రూపాయల వరకు లోన్ తీసుకునే సదుపాయాన్ని కూడా కల్పించారు.

కుటుంబాలకు రక్షణ కవచాలు

ఎల్‌ఐసీ సంస్థలో ఎండోమెంట్, మనీ బ్యాక్, హోల్ లైఫ్, చిల్డ్రన్స్, టర్మ్, పెన్షన్, యూఎల్‌ఐపీ, మైక్రో పాలసీలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం మీద 35 రకాలు పాలసీలు పొందవచ్చు. అనేక ప్రైవేటు రంగ సంస్థలు ఉన్నప్పటికీ ఎల్‌ఐసీ సంస్థపై ప్రజలకు అపార నమ్మకం ఉండడంతో.. కుటుంబంలో ఒక్కరైనా ఎల్‌ఐసీ పాలసీని కలిగి ఉండటం విశేషం. వికసిత్ భారత్-2047 ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్కరికీ బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోంది.

నేటి నుంచి పోటీలు, సమావేశాలు

ఎల్‌ఐసీ వారోత్సవాల సందర్భంగా కడప కలెక్టరేట్ సమీపంలోని ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయంలో సెప్టెంబరు 1న ప్రత్యేక సమావేశాన్ని చేపట్టి వారోత్సవాలను ప్రారంభించనున్నారు. 2న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు.. 3న గురు దివస్ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఎల్‌ఐసీ ఉద్యోగులకు సత్కరించనున్నారు. అదే రోజున కడపలో ఎల్‌ఐసీ అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులతో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. 4న వైద్య శిబిరం, 5న నగరంలోని పలు వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, 7న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారోత్సవాలను ముగించనున్నట్లు కడప డివిజన్ అధికారులు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ నిధిమీనా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసి అర్జీల రూపంలో తమ సమస్యలు అధికారులకు తెలియజేశారు. జేసీ నిధిమీనా మాట్లాడుతూ. . అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం ఆలస్యం అయ్యేలా ఉంటే ఆ విషయాన్ని అర్జీదారుడుకు తెలియజేయాలన్నారు. డీఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, శివరామిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారు నుంచి వినతి స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టరు నిధిమీనా

నిర్ణీత సమయంలో కేసులు పరిష్కరించాలి

కడప నేర వార్తలు, న్యూస్‌టుడే: నిర్ణీత సమయంలో కేసులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ పోలీసులకు సూచించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్పీ వినతులను పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు వాటిని బదలాయించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఏదైనా సమస్యలు పోలీసుల దృష్టికి తీసుకొస్తే స్పందించాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు సకాలంలో పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 117 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

ఆకు కూరల సాగులో భళా

లింగాల, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకు కూరలు, కూరగాయలు విక్రయిస్తూ లింగాల మండలం రామన్నూతలపల్లెకు చెందిన ఎమ్.అరుణ ఆర్థిక స్వావలంబన సాధిస్తూ తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువుల ఖర్చులు పెరగడంతో తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఆదాయం ఇచ్చే ఆకు కూరల సాగు ఎంచుకుని ఆదాయం సంపాదిస్తున్నారు.

స్ఫూర్తి

● **మూడు ఎకరాల్లో..:** తనకున్న మూడు ఎకరాల పొలంలో రెండు ఎకరాల్లో మొక్క జొన్న. అర ఎకరా విస్తీర్ణంలో ఆకు కూరలు, కూరగాయల సాగు చేపట్టారు. పండించిన ఆకుకూరలను పులివెందుల స్మార్ట్‌కిచెన్‌కు ప్రతి శుక్రవారం 70 కట్టలు రవాణా చేస్తున్నారు. కట్ట రూ.10 చొప్పున రూ.700 ఆదాయం వస్తోంది. ఇలా నెలలో నాలుగు సార్లు రూ.2,800 ఆదాయం సమకూరుతోంది. దీన్ని రూ.10 వేలకు పెంచడానికి ఆకు కూరల సాగు పెంచారు. బీర, కాకర, బెండ, ముల్లంగి, మొటిక, అలసందలు సాగు, ఆకు కూరల సాగుతో నెలకు రూ.20 వేల మేర ఆదాయం పొందుతున్నారు. రెండు ఎకరాల్లోని మొక్కజొన్నకు జీవామృతం, సేంద్రియ ఎరువులు వాడటంతో ఏపుగా పెరిగింది. మరో నెల రోజుల్లో దిగుబడులు అందనున్నాయి. క్వింటా ధర రూ. 2 వేలు పలుకుతోంది. 60 క్వింటాళ్ల దిగుబడులు రానున్నాయి. రూ.1.20 లక్షల ఆదాయం రానుంది. సొంత కాళ్లపై నిలబడటంలో ఉండే తృప్తి వేరు. ఆకు కూరల సాగు నా కుటుంబ రూపురేఖలను మార్చేసిందని అరుణ తెలిపారు. ఆమె తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఆకు కూర తోటలో రైతు అరుణ

ప్రశ్న:
జీవాల్లో కాలిపుండు వ్యాప్తి ఉంది. అవి నడవలేకపోతున్నాయి. వ్యాధి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.?
- శివశంకర్‌రెడ్డి, కమలాపురం

సమాధానం: వర్షాలు కురిసే సమయంలో గొర్రెలు సాధారణంగా కాలిపుండ్ల వ్యాధితో ఇబ్బంది పడుతుంటాయి. నడవలేక కుంటుతుంటాయి. ఈ వ్యాధి సూక్ష్మజీవుల కారణంగా వ్యాప్తి చెందుతుంది. చిత్తడి నేలలపై మంద తిరిగినప్పుడు ఈ లక్షణాలు ఎక్కువగా కన్పిస్తుంటాయి.

వ్యాధి లక్షణాలు: గొర్రెల కాలి గిట్టల మధ్యలో ఎర్రగా కందుతుంది. మేత సరిగా మేయవు. బరువు తగ్గిపోతుంటాయి. ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పట్టి దుర్వాసన వస్తుంది. వ్యాధి తీవ్రత కారణంగా గిట్టలు ఊడిపోయే ప్రమాదముంది.

చికిత్స: వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం మైలతుత్తం ద్రావణం లేదా 10శాతం జింకు సల్ఫేట్ ద్రావణం లేదా ఫార్మాలిన్ ద్రావణంతో రోజుకు రెండు దఫాలు శుభ్రం చేయాలి. పశువైద్యుని సలహా మేరకు యాంటిబయోటిక్ ఆయింట్‌మెంట్ కొద్ది రోజులు పూయాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి ఇంటి వద్దనే ఉంచాలి. మందను చిత్తడి నేలలు, నీళ్లు నిలిచే ప్రదేశాల్లో నిలపకుండా ఎత్తైన ప్రదేశాల్లో నిలపాలి.

- మల్లికార్జునరెడ్డి, పందిళ్లపల్లె పశువైద్యాధికారి, కమలాపురం మండలం
- న్యూస్‌టుడే, కమలాపురం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

12న జాతీయ లోక్ అదాలత్

కడప లీగల్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్ తెలిపారు. సోమవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు న్యాయసేవలు ఎంతో అవసరమన్నారు. గత జులై 11వ తేదీ నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,05,798 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రజలకు లోక్ అదాలత్ ప్రయోజనాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసు శాఖ, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో మల్లికార్జునుడు

జిల్లా ప్రధాన జడ్జిని కలిసిన అధికారులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి.రామగోపాల్‌ను సోమవారం అధికారులు కలిశారు. డీఆర్వో కె. మల్లికార్జునుడు, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన, రెండో తరగతి మేజిస్ట్రేట్లు, రాజంపేట తహసీల్దారు దస్తగిరి, జిల్లా అటవీ అధికారి టి.రాజశేఖర్ బాబు, స్పెషల్ మహిళా జైలు సూపరింటెండెంట్ కృష్ణవేణి, జైలర్ భువనేశ్వరి కలిసి మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

ఎల్‌నినోతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం

సీకే దిన్నె, కడప (చిన్నచౌకు), న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం అధికారి డాక్టరు జి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు కేవీకేలో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులు - శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలిచ్చారు. జిల్లాలో వర్షపాతం 75 శాతం తక్కువగా నమోదైందన్నారు. కరవు పరిస్థితుల దృష్ట్యా నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి, ఆత్మ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యేశ్వరరావు, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, కృష్ణప్రియ, మాధురి, శ్రీవల్లి, యాస్మిన్, మహేష్‌బాబు, సాయిమహేశ్వరి, మానస, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి.. చిత్రంలో శాస్త్రవేత్తలు, అధికారులు

కలకలం రేపిన సుపారీ హత్య

వీరబల్లి, న్యూస్‌టుడే: భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని ఎలాగైనా హతమార్చాలని భర్త పథకం పన్నాడు. తాను స్థానికంగా లేక పోయినా హత్య చేసే వారితో సుపారీ కుదుర్చుకుని హత్య చేయించారు. ఈ ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. వీరబల్లి మండలం ఓదివీడుకు చెందిన షేక్ షాహిదా, కడప మోచంపేటకు చెందిన షేక్ నజీంబాషా దంపతులు. వీరికి కుమార్తె సంతానం. జీవనోపాధి నిమిత్తం పదేళ్ల కిందట భార్యాభర్తలిద్దరూ.. కువైట్‌కు వెళ్లారు. అక్కడ వరుసకు పిన్ని కుమారుడైన షేక్ ఖాసీం కూడా వారితో కలిసి మెలిసి మెలిగే వారు. ఆ సమయంలోనే భార్య షాహిదాతో ఖాసీం వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, భర్త నజీం అనుమానం పెంచుకున్నాడు. ఈ పరిస్థితుల్లో భార్య షాహిదా నాలుగేళ్ల కిందట తిరిగి ఓదివీడుకు వచ్చారు. ఇటీవల ఖాసీం కూడా తన స్వగ్రామమైన మోచంపేటకు వచ్చారు. ఈ క్రమంలో అతను తరచూ.. ఓదివీడుకు వచ్చి వెళ్లే వారు. ఈ విషయం తెలుసుకున్న భర్త నజీం బాషా అతడ్ని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. కడపకు చెందిన బాబ్జి, ఖాదర్‌వలీలతో సుపారీ కుదుర్చుకున్నారు. ఖాసీం శనివారం ఓదివీడుకు వచ్చిన విషయాన్ని గమనించిన నిందితులిద్దరూ.. షాహిదా ఇంటికి వెళ్లారు. ఖాసీం, షాహిదా ఇంట్లో ఉండడం గమనించి, లోపలికి వెళ్లి గడియ పెట్టారు. ఇద్దరిని చితకబాది షాహిదాను బయటకు తోసేశారు. ఖాసీంను కర్రలు, ఇతర ఆయుధాలతో హత్య చేశారు. చుట్టుపక్కల వారు గమనించి బాబ్జిని అడ్డుకున్నారు. ఖాదర్‌వలీ పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలను త్వరలో మీడియాకు తెలియజేస్తామని ఎస్సై సుస్మిత తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కమలాపురం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి వైద్యులకు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దచెప్పలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్యుల పనితీరు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నాయకులు సుధాకర్, మహేశ్వర్‌రెడ్డి,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

● **పెండ్లిమర్రి:** గ్రామ సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం పెండ్లిమర్రి మండలం మాచునూరు సచివాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు భోజనం అందించడంలో నిర్లక్ష్యం వద్దు

పులివెందుల, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యార్థులకు అందించే భోజనంలో నిర్లక్ష్యం వద్దని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. వారికి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పులివెందులలోని రమణప్ప సత్రం పాఠశాల ఆవరణలో ఉన్న స్మార్ట్ కిచెన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు సిద్ధం చేసిన వంటలను ఆయన ఒక్కొక్కటిగా పరిశీలించారు. భోజనం, పప్పు, తదితర వంటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తెదేపా నాయకులు జ్ఞానేశ్వరనాయుడు, వెంకటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

క్రమబద్ధీకరణకు డిమాండ్

వేంపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వేంపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని, వంద శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పారా మెడికల్ సిబ్బంది ఆందోళన

సర్వజన ఆసుపత్రి (కడప), న్యూస్‌టుడే: స్థానిక రిమ్స్ ఓపీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఓపీ విభాగం ఎదుట సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారా మెడికల్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, కాంట్రాక్ట్ మెడికల్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ ఓపీ విభాగం ఎదుట నిరసన తెలుపుతున్న పారామెడికల్ సిబ్బంది

రెండు రోజుల పాటు పులివెందులలో జగన్

కడప ఏడురోడ్లు, పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ సెప్టెంబరు 1న మధ్యాహ్నం 12 గంటలకు పులివెందులకు చేరుకోనున్నారు. అనంతరం భాకరాపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. రాత్రికి పులివెందులలోని తన నివాసంలో బస చేయనున్నారు. 2వ తేదీ ఉదయం 7.45 గంటలకు ఇడుపులపాయకు వచ్చి.. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించనున్నారు. అనంతరం బెంగళూరుకు వెళ్లనున్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఏడురోడ్లు: పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణమే నియమించడంతో పాటు మధ్యంతర భృతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని రెవెన్యూ అసోసియేషన్ ఛైర్మన్ రోనాల్డ్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్ డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ నోటీస్‌ను డీఆర్వో మల్లికార్జునుడుకు సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. హెడ్‌మాస్టర్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఉమెన్స్ వింగ్ ఛైర్‌పర్సన్ ఖాజీబీ పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం హర్షణీయం

వేంపల్లె, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం హర్షణీయమని, అయితే సింహ భాగం పనులు పూర్తయింది కాంగ్రెస్ హయాంలోనే అని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీ కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అన్ని పార్టీల కృషి, భాగస్వామ్యం ఉందన్నారు. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో క్షామ పీడిత ప్రాంతాలకు సాగునీరు, ఫ్లోరైడ్ బాధిత ప్రజలకు తాగునీరందించేందుకు వెలిగొండ ప్రాజెక్ట్‌ను నిర్మించాలని కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పూల సుబ్బయ్య నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. అందుకే కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం చేశారన్నారు. ప్రస్తుతం తొలి ఫేజ్ మాత్రమే పూర్తయిందని, రెండో ఫేజ్ కూడా పూర్తి చేస్తేనే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుందన్నారు.

అల్లర్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

ఈనాడు, దిల్లీ: అల్మాస్‌పేట్‌లో మే9న చోటుచేసుకున్న ఉద్రిక్తతల్లో.. పోలీసు ఇన్‌స్పెక్టర్‌పై దాడిచేసిన కేసులో నిందితుడిగా ఉన్న షేక్ జాఫర్ ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ జులై 7న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ.. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవల ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది ప్రేరణాసింగ్ వాదనలు వినిపించారు. ఇందుకు జస్టిస్ సంజయ్ కుమార్ స్పందిస్తూ.. దాడి సమయంలో పిటిషనర్ గుంపులో ఉన్నారన్న కారణంతో నిందితులుగా చేర్చడం ఆమోదయోగ్యం కాదని.. సరైన ఆధారాలు చూపాలని పేర్కొన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ తమకు నోటీసులు జారీచేస్తే ఆధారాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

ప్రమాదాల నియంత్రణపై దృష్టి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి భద్రత చర్యలను పటిష్ఠంగా చేపట్టి ప్రమాదాలను గణనీయంగా నియంత్రించాలని డీఆర్వో మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌హెచ్-67, ఎన్‌హెచ్-716 ప్రాంతాలు అత్యంత ప్రమాదకర మార్గాలుగా గుర్తించామన్నారు. గుర్తించిన 338 ప్రాంతాల్లో రహదారి భద్రతా లోపాలను ప్రాధాన్య క్రమంలో సరిచేయాలన్నారు. ముఖ్యంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. ఈ సమయాన్ని ప్రత్యేక ప్రమాద నియంత్రణ కాలంగా పరిగణించి పోలీసు, రవాణా, రహదారుల శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలతో నియంత్రించాలని సూచించారు. వేగ నిరోధకాలు, సూచికలు, గుంతల వద్ద హెచ్చరికలు, సౌర విద్యుత్తు దీపాలు, రహదారి సూచిక బోర్డులు, వెలుగుల ఏర్పాటు వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలల వద్ద ప్రత్యేక రహదారి భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ విబూకృష్ణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు, కడప ఆర్డీవో మురళీ, కేఎంసీ కమిషనరు భవానీప్రసాద్, జడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, విద్యుత్తు శాఖల ఎస్ఈలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు, రోడ్డు సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మల్లికార్జునుడు

APSRTC
టెండరు ప్రకటన

YSR కడప జిల్లా పరిధిలోని బస్ స్టేషన్ల నందు OPRS కౌంటర్లు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నిర్వహించుటకు అనుభవం/ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు/ కాంట్రాక్టర్లు/ సంస్థల నుండి సీల్డు టెండరు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.02-09-2026 నుండి తేది.16-09-2026 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.17-09-2026న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, కడప నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ : https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. E2/797(03)/2026-DPTO/YSR, తేది:31-08-2026 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, కడప.

పత్రిక ప్రకటన

నూతన కలెక్టరు ఆఫీస్ కాంప్లెక్స్ నందు పొరుగు సేవల ఏజెన్సీ ద్వారా SECURITY పనులను చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

దరఖాస్తులు 01.09.2026వ తేదీ నుండి 08.09.2026 తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు కలెక్టరు కార్యాలయము (సి.బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.5000/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తును స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 08.09.2026వ తేది మధ్యాహ్నం 3.00 గంటల సమయం లోపు సమర్పించవలెను. 11.09.2026వ తేదీన సాయంత్రం 4.00 గంటలకు టెండర్లు తెరవబడును. అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

సం/- **శ్రీమతి నిధి మీనా,** I.A.S, జాయింట్ కలెక్టర్/ఛైర్మన్, డి.పి.సి., కడప.

పత్రిక ప్రకటన

వై.యస్.ఆర్. కడప జిల్లా, నూతన కలెక్టరు వారి కార్యాలయం నందు కంప్యూటర్స్ మరియు ప్రింటర్ కొనుగోలు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

కంప్యూటర్స్ మరియు ప్రింటర్స్ (configuration) వివరాలు 01.09.2026వ తేదీ నుండి 08.09.2026వ తేదీ మధ్యాహ్నం 03.00 గంటల వరకు పరిపాలన అధికారి, కలెక్టరు వారి కార్యాలయము (సి.బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.10,000/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తును స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 08.09.2026వ తేదీ మధ్యాహ్నం 03.00 గంటల సమయం లోపు సమర్పించవలెను 11.09.2026వ తేదీన సాయంత్రం 04.00 గంటలకు టెండర్లు తెరవబడును. అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

సం/- **శ్రీమతి నిధి మీనా,** I.A.S, జాయింట్ కలెక్టర్/ఛైర్మన్, డి.పి.సి., కడప.

EENADU Classifieds

EDUCATION | PERSONAL CLASSIFIEDS

సులభంగా పాస్ అవకాశం 10th/ ఇంటర్ (APOSS/NIOS) B.A, B.COM, B.SC, B.B.A, BCA, M.A, M.COM, M.SC, MBA, MCA, B.TECH, DIPLOMA, ITI, గ్రేట్ ఇండియా అకాడమి ప్రొద్దుటూరు. ✆: 8639612692, 9542222400.

LOST

ఒరిజనల్ సర్టిఫికెట్ పోయినది. బచ్చుమేఘన S/O B.సాయిరాం పేరున గల ఇంటర్మీడియట్ ఒరిజనల్ సర్టిఫికెట్ ముద్దనూరు పరిసర ప్రాంతంలో పోయినది. దొరికిన వారు వెంటనే తెలియజేయగలరు. సెల్: 6305775266.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే తమ లక్ష్యమని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మన సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డిలు స్పష్టం చేశారు. సోమవారం కడప ఎన్జీవో కాలనీలోని భాజపా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప నగరంలో భాజపాకు ఎన్ని సీట్లు ఇస్తారనేది అధిష్ఠానం చూసుకుంటుందని.. అయితే ఎన్ని సీట్లు ఇచ్చినా.. వాటిల్లో గెలిచి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అధిక స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, ప్రవీణ్‌నాయుడు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు

పులివెందుల: మరణానంతరం కూడా జీవించాలన్నా, సుదీర్ఘకాలం గుర్తుండాలన్నా నేత్రదానం చేయడం వల్లే సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాజామొహినిద్దీన్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సోమవారం పులివెందులలోని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నేత్రదాన పక్షోత్సవాల అవగాహన కార్యక్రమం గోడపత్రాలను ఆయన స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్ఎంవో డాక్టర్ నవీన్, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలకముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా తండ్రి అయిన చిట్టిబోయిన కృష్ణమూర్తి, S/o సి.సుబ్బయ్య 17.10.1988 తేదీన హిమాయత్ నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంలో రిజిస్ట్రార్ కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 12767/1988 నేను కడప, శంకరాపురంలో జిరాక్స్ తీసుకొని ఆటోలో ఇంటికి పోయి చూసుకొనగా రిజిస్టర్ కాగితములు కనపడలేదు. తర్వాత నేను ఆటో అతన్ని మరియు ఇతరులను అడుగగా ఆ స్థలములో కనబడలేదు అని చెప్పినారు. పై రిజిస్టర్ విక్రయ దస్తావేజు నంబరు 12767/1988 తారీకు 17.10.1988 ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికము ఇవ్వబడును.

ఇట్లు : **చిట్టిబోయిన శైలజ,**
దోర్ నంబరు: 41/700-1, న్యూ సత్యసాయి హాస్పిటల్, శంకరాపురం, కడప. సెల్: 9392298106

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No.7/2026

లోమడ @ చిన్నజోగిగారి విజయభాస్కర్ రెడ్డి S/o రామిరెడ్డి, హిందు, 50 సం॥లు, సాకిన్ జోగిరెడ్డిగారిపల్లె H/o యర్రబొమ్మనపల్లె గ్రామం, చక్రాయపేట మండలం ..పిటీషనరు

Vs

1. లోమడ రామచంద్రారెడ్డి S/o రామిరెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 2. వీరమల్లు వెంకట దిలీప్ S/o దర్బార్, వెన్నపల్లె. 3. వీరమల్లు వెంకట కుమారి W/o దర్బార్, వెన్నపల్లె. 4. వీరమల్లు రాములమ్మ W/o వెంకటేసు, వెన్నపల్లె. 5. L.T. భాస్కర్‌రెడ్డి S/o బలరాం రెడ్డి, గడ్డంవారిపల్లె. 6. L.T. బలరాం రెడ్డి S/o బయ్యారెడ్డి, గడ్డంవారిపల్లె. 7. B. హరినాథరెడ్డి S/o రామాంజుల్‌రెడ్డి, ఈడిగపల్లి బజారు గాండ్లపెంట (VI), కదిరి (మం). 8. లోమడ సునీత W/o మల్‌రెడ్డి, శిద్దారెడ్డిగారిపల్లె. 9. బత్తల శ్రీరాములు S/o పెద్ద నారప్ప, శిద్దారెడ్డిగారిపల్లె. 10. కుమార కాల్వ రెడ్డెప్ప S/o పాపయ్య, హరిజనవాడ, గడ్డంవారిపల్లె. 11. C. రామచంద్ర నాయుడు S/o పెద్దన్న నాయుడు, సంగటివారిపల్లె, పెద్దన్నవారిపల్లె గ్రామం, తలుపుల (మం). 12. లోమడ ఓబులమ్మ W/o గంగిరెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 13. పొట్టిపాటి రాఘవరెడ్డి S/o గంగిరెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 14. లోమడ రామక్రిష్ణారెడ్డి S/o రామిరెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 15. నారాయణరెడ్డి S/o నారాయణరెడ్డి, గుర్రాల చింతలపల్లె గ్రామం, పెండ్లిమర్రి (మం). 16. భూషనగారి లోకనాథరెడ్డి S/o రామాంజులు రెడ్డి, ఎలుగూటివారిపల్లె, గాండ్లపెంట, కదిరి (మం). 17. బొజ్జా చెన్నారెడ్డి S/o చిన్నపరెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 18. L.N. గంగిరెడ్డి S/o రామసుబ్బారెడ్డి, గడ్డంవారిపల్లె. 19. L.N. గంగోజమ్మ W/o గంగిరెడ్డి, గడ్డంవారిపల్లె. 20. P. నాగభూషణ S/o తిమ్మయ్య, గడ్డంవారిపల్లె. 21. సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ S/o మోదిన్ షరీఫ్, కుమారకాల్వ గ్రామం. 22. D. భానుప్రకాష్ S/o D.V.క్రిష్ణారెడ్డి, నీలాద్రి లేఅవుట్, దొడ్డ తోగూరు, బెంగళూరు సిటీ. 23. మేకల విజయ నరసింహులు S/o రాములయ్య, గడ్డంవారిపల్లె. 24. C.గంగిరెడ్డి S/o పెద్దబసిరెడ్డి, గడ్డంవారిపల్లె. 25. B.వనజమ్మ W/o హరినాథరెడ్డి, గాండ్లపెంట (గ్రా&మం). 26. Y.రామచంద్ర S/o పుల్లయ్య, గడ్డంవారిపల్లె. 27. C.బసిరెడ్డి S/o చిన్న బసిరెడ్డి, గడ్డంవారిపల్లె. 28. A.శ్రీరాములు S/o గంగయ్య, చిన్నపల్లె, తలుపుల (మం). 29. L.B.రామాంజులు రెడ్డి S/o గంగిరెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 30. సయ్యద్ జాకిర్ హుస్సేన్ S/o మోదిన్ షరీఫ్, కుమారకాల్వ. 31. వేముల వెంకట్రమణ S/o వెంకటయ్య, గాంధీరోడ్డు, వేంపల్లె. 32. డేరంగుల వెంకటేసు S/o వెంకటసుబ్బయ్య, గడ్డంవారిపల్లె. 33. P.వాసుదేవరెడ్డి S/o సుబ్బారెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 34. M.ఓబులేసు S/o చిన్న సుబ్బయ్య, శిద్దారెడ్డిగారిపల్లె. 35. నంగి భరత్‌కుమార్‌రెడ్డి S/o సదాశివరెడ్డి, ఉబ్బర వాండ్లపల్లె. 36. బొజ్జా రవీంద్రారెడ్డి S/o సిద్దారెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 37. C.M. వెంకట్రామిరెడ్డి S/o రామచంద్రారెడ్డి, తిక్కలపల్లె. 38. K. జగన్‌మోహన్ రెడ్డి, S/o లాల్‌రెడ్డి, BTO పల్లె గ్రామం, చాపాడు (మం). 39. B. రామాంజనేయులు, S/o వెంకటసుబ్బయ్య, శిద్దారెడ్డిగారిపల్లె. 40. వేల్పుల లోకేష్, S/o ఆంజనేయులు, వడ్డేపల్లె, తలుపుల (మం). 41. పల్లెపు ఆంజనేయులు S/o పాపన్న, వడ్డేపల్లె, తలుపుల (మం). 42. L.విజయభాస్కర్ రెడ్డి S/o రామిరెడ్డి, శిద్దారెడ్డిగారిపల్లె. 43. వేంపల్లె శివారెడ్డి S/o రాజగోపాల్‌రెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 44. L.సుదర్శన్ రెడ్డి S/o బయ్యారెడ్డి, జోగిరెడ్డిగారిపల్లె. 45. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, చక్రాయపేట (మం).

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనరు, రెస్పాండెంట్లు అయిన మీపైన ఇన్‌సాల్వెన్సీగా తీర్మానించమని I.P. పిటీషన్‌ను దాఖలు చేసియున్నాడు. సదరు పిటీషన్‌లో మీరు 7.9.2026 తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గాని, వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
శ్రీ డి.వాసు దేవుడు, B.A., LL.B.,
పిటీషనరు పరం అడ్వకేటు
రాయచోటి

భౌబోయ్ కుక్కలు : నగర వాసుల బెంబేలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప రవీంద్రనగర్‌లో రోజు రోజుకూ కుక్కల బెడద అధికమైంది. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. దారిలో వెళ్లే వారిని వెంబడిస్తూ దాడులు చేస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో శునకాల సంతతి రెండింతలు అయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పిల్లలను బయటికి పంపాలంటే భయం

వీధి కుక్కల కారణంగా చిన్నపిల్లలను ఒంటరిగా బయటికి పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి కూడా అలానే ఉంది. కుక్కలు లేని మార్గం వెతుక్కొని వెళ్లాల్సి వస్తోంది. అయిదారు కుక్కలు గుంపులుగా సంచరిస్తూ.. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట పడుతున్నాయి. వాటిని తప్పించుకునే క్రమంలో చోదకులు కింద పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. రోజూ ఎవరో ఒకరు కుక్క కాటు బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఈ ప్రాంతాల్లో సమస్య తీవ్రం

పాత బస్టాండు వంతెనపై, రవీంద్రనగర్‌లోని పాత న్యాయకళాశాల సమీపంలో, బుగ్గయేరు గంగమ్మ గుడి సమీపంలో కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో కొత్తవారు వెళ్లారంటే కుక్క కాటు బారిన పడాల్సిందే. సమస్య పరిష్కరించకపోతే శునకాల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారముందని స్థానికులు పేర్కొంటున్నారు.

రవీంద్రనగర్ వీధిలో కుక్కల గుంపు

తీసుకున్న చర్యలు శూన్యం..

వీధి కుక్కల నియంత్రణలో నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం వల్లే వాటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కార్పొరేషన్‌లో ఫిర్యాదులు చేసినా తీసుకున్న చర్యలు శూన్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని వారు కోరుతున్నారు.

రోడ్లపై వెళ్లాలంటే భయమేస్తోంది

నగరపాలక సంస్థ అధికారులు కుక్కల సమస్యలపై దృష్టి పెట్టాలి. వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. వాటి వల్ల రోడ్లపై నడిచి వెళ్లాలంటే భయమేస్తోంది. - **వెంకటసుబ్బయ్య, రవీంద్రనగర్, కడప**

చర్యలు తీసుకుంటాం: రవీంద్రనగర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టుకుని తరలిస్తాం. వాటి సంతతి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. - **రాకేష్, అదనపు కమిషనర్, కడప కార్పొరేషన్**

చెరగని చరిత్రను లిఖించిన అక్షర మూర్తి ఆరుద్ర

మారుతీనగర్, న్యూస్‌టుడే: తనదైన ముద్ర వేసి తెలుగు సాహిత్య కేంద్రంలో చెరగని చరిత్రను లిఖించిన అక్షరం మూర్తి ఆరుద్ర అని రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆరుద్ర జయంతిని పురస్కరించుకుని స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సోమవారం ఆరుద్ర చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏజెంట్ మోసంపై ఎస్పీకి ఫిర్యాదు

కడప నేరవార్తలు: కువైట్‌కు పంపిస్తానంటూ రూ.4.59 లక్షలు తీసుకుని మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం చెందిన ఓబయ్య సోమవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

చక్రాయపేట (వేంపల్లె): చక్రాయపేట పరిధి కల్లూరిపల్లెలో జల గంగమ్మ ఆలయంలో నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠను కనులపండువగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి పూజలు

వేంపల్లె: వేంపల్లెలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ విఘ్నేశ్వరుడికి పంచామృతాభిషేకం, నివేదన, మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

కడప లీగల్: నగరంలోని శివానందపురంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు, న్యాయవాది హరిబాబు సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధీ నగర్ ప్రజలకు, రైల్వే కార్మికులకు బీమా చట్టంపై అవగాహన కల్పించారు. అధికార సంస్థ ప్రతినిధులు ఎన్. నీలకంఠేశ్వర్‌రెడ్డి, పి.మనోహర్, ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

సుందరంగా అలంకరించిన రాధాకృష్ణుల వద్ద లీలా బెహెన్‌జీ తదితరులు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న ఓం శాంతి భవన్‌లో సోమవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల సబ్ జోనల్ ఇన్‌ఛార్జి లీలా బెహన్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఇక్కడి విద్యాలయం బాధ్యులు విజయ, త్రివేణి, సౌమ్య తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు.

భారతి మొండి వైఖరి వీడాలి

కమలాపురం, న్యూస్‌టుడే: భారతి సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం మొండి వైఖరి వీడి తమను ఉద్యోగాల్లో చేర్చుకునే వరకూ న్యాయ పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు స్పష్టం చేశారు. కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లెలోని భారతి సిమెంట్ పరిశ్రమ వద్ద 28వ రోజు సోమవారం ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు శాంతియుతంగా నిరసన తెలిపారు.

భాజపా శ్రేణులపై చర్యలు తీసుకోవాలి

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కడప భాగ్యనగర్ కాలనీ : ఉత్తరాఖండ్‌లోని భాజపా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు జకరయ్య డిమాండు చేశారు. సోమవారం నగరంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ నేత మల్లికార్జునఖర్గే సభ నిర్వహించిన ప్రాంతాన్ని భాజపా కార్యకర్తలు శుద్ధి చేయడాన్ని తప్పుపట్టారు. సదరు ఘటనకు సంబంధించిన భాజపా కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలన్నారు. కుల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. నాయకులు శ్రీనివాసులు, కమాల్‌బాషా, సుధాకర్, జాబీర్‌అలీ పాల్గొన్నారు.

శరణు కోరిన వారికి ఆరోగ్యమాత అభయం

నాగరాజుపేట, న్యూస్‌టుడే: శరణుకోరి వచ్చిన వారికి అభయమిచ్చి ఆదుకునే మాత ఆరోగ్యమాత అని కడప డీనరీ పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ వరప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో మూడో రోజున ఆయన అమ్మ వారి సందేశాన్ని అందించారు. బిషప్ సెక్రటరీ ఫాదర్ లూర్థురాజ్ దివ్యబలిపూజను సమర్పించారు. పూజ ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ఊరేగించారు. విశ్వాసులు ఆరోగ్యమాత జపాలను జపిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఆరోగ్యస్వామి, తిరునాల కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు, మరియదళం సంఘం, మౌలిక సంఘం ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొన్నారు.

దివ్యబలిపూజలో పాల్గొనేందుకు బలిపీఠం వద్దకు వస్తున్న గురువులు

పరిశ్రమలకు అనుమతుల్లో ఆలస్యం తగదు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జిల్లా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతుల్లో ఆలస్యం కాకుండా చూడాలని డీఆర్వో మల్లికార్జునుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. డీఆర్వో మల్లికార్జునుడు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 11,905 దరఖాస్తులు అందగా... 11,774 దరఖాస్తులకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన వాటికి కూడా సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని డీఆర్వో సూచించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టరు చీఫ్ చిన్నారావు, ఎల్‌డీఎం జనార్దన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక శాఖ, డీటీఓ, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీఐఐసీ, టూరిజం తదితర శాఖల అధికారులు బ్యాంకర్లు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పులివెందులలోని తన నివాసంలో ప్రజల నుంచి సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలోని తన నివాసంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన చరవాణిలో ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం

కడప ఏడురోడ్లు: పరిశ్రమల్లో భద్రత చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్వో మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ... సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. ప్రత్యేకంగా రెడ్ కేటగిరీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం, కార్మికుల రక్షణ చర్యలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఫ్యాక్టరీస్ శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టరు చిన్నారావు, పరిశ్రమల జీఎం చాంద్‌బాషా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు చేయాలని ఆందోళన

పులివెందుల గ్రామీణ: ముద్దనూరు నుంచి ఆర్.తుమ్మలపల్లె మీదుగా చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణాల్లో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేయించాలంటూ సోమవారం ఎస్సీ కాలనీ వాసులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఈ క్రమంలో రాకపోకలు స్తంభించాయి. ఎస్‌హెచ్ఎస్ అధికారులు స్పందించి దెబ్బతిన్న పైపులకు మరమ్మతులు చేయించి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

పారిశ్రామిక రంగంలో యువత రాణించాలి

కడప విద్య: విద్యార్థినులు భవిష్యత్తులో పారిశ్రామిక రంగంలో రాణించాలని పరిశ్రమల శాఖ రిటైర్డ్ జిల్లా జనరల్ మేనేజర్ గోపాల్ అన్నారు. స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం 'మీట్ అండ్ గ్రీట్, క్యాంపస్ టు ఇండస్ట్రీ' అనే కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ గురువిరెడ్డి, ఇంగ్లీష్ విభాగం ఇన్‌ఛార్జి రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కమలాపురం: రానున్న స్థానిక ఎన్నికల్లో గొడవలు, వర్గ విభేదాలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని లేటపల్లెలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

● **చెన్నూరు, న్యూస్‌టుడే:** చెన్నూరు పోలీస్ స్టేషన్ సోమవారం రౌడీ షీటర్లకు సీఐ చాంద్‌బాషా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవనానికి భంగం కలిగించినా.. అలజడులకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్ చంద్రబోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆగస్టు 22న మృతి చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ రామసుబ్బయ్య కుటుంబానికి 1998వ బ్యాచ్ ఏపీఎస్పీ సంక్షేమ సంఘం వారు సోమవారం రూ.65వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సుబ్రమణ్యం, సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏపీఎస్పీ సంక్షేమ సంఘం సభ్యులు

● **హెడ్ కానిస్టేబుల్‌కు సత్కారం: కడప నేరవార్తలు:** కడపలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జయరామరాజు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జయరామరాజు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఆర్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





LIC FORMATION DAY

ప్రతి ఒక్కరికీ ఒక పాలసీ, ప్రతి ఇంటికీ ఒక పాలసీ.
జీవిత బీమా చేయండి - ధీమాగా ఉండండి.
మా పాలసీదారులకు, ఏజెంట్లకు, నా తోటి డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు.

S.J.PREMDEEP
Development Officer,
Kadapa.
Cell: 8341559515

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఏసీపీసీ-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

[illegible]

తేది: 30-07-2026
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu